MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 5 రంగారెడ్డి జనవరి 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-

## అభివృద్ధి పథంలో వడివడిగా తెలంగాణా ... శిఖరాగ్ర విశ్వ సమ్మేళనం!!




విశ్వ సమ్మేళనం ప్రారంభ సమావేశంలో తెలంగాణా గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి శ్రీ కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క ప్రభృతులు



శ్రీ మామిడి రామారెడ్డి సంస్మరణ

## నూతన ఆంగ్ల సంవత్సర, 2026 సంక్రాంతి శుభాకాంక్షలు !

Silver Jubilee Year

apmas

Empowering Communities




తెలంగాణాలో సహకార రంగంపై మహాసభ



స్వరజిత్ రే స్మారక ప్రసంగం : శ్రీ త్రిలోచన్ శాస్త్రి

తిరిగి ప్రాణంపోసుకున్న ప్రకృతి వ్యవసాయం!



శ్రీ విజయరాం

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌లో తెలుగు తేజాలు !




శివాని కార్తికేయ ప్రాజ్ఞిక

నాబార్డ్ సౌజన్యంతో ....

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత

సంపుటి 24 సంచిక 5




సంపాదకీయం

## గతం ... ఆగతం !

**కా**ల ప్రవాహంలో మరో అల నెమ్మదిగా కరిగిపోయింది. ఇంకొక నూత్న లహరి పైకెగసి, సరికొత్త రాగాలతో పలకరిస్తున్నది. అది ఎన్నో అనుభవాలను, అనుభూతులను, అవగాహనలను అందించి, పాఠాలు నేర్పి తరలిన గతం! ఇది అనేకానేక ఆశలతో, ఆశయాలతో, ఆచరణ సంకల్పాలతో భవిష్యత్తులోకి నడిపించే భవ్య వర్తమానం. 2026 ఆంగ్ల నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ అందరికీ ఏపిమాస్ నవ్య వార్షిక శుభాకాంక్షలు! కొత్త సంవత్సరాన్ని పలకరించే ముందు, ఒక్కసారి గడచిన సంవత్సర విశేషాలను విహంగ వీక్షణం చేద్దాం. ఏపిమాస్‌కు సంబంధించి అప్పుడే సంవత్సర కాలం గడచిందా అన్నంత వేగంగా, నిత్య నూతనంగా 2025 సాగింది. 2024 వెడుతూ వెడుతూ, ఢిల్లీలో 'లైవ్లీహుడ్స్ ఇండియా' చే ' రెండు దశాబ్దాల ప్రగతి ప్రేరణ ప్రస్థాన' పురస్కారాన్ని ఏపిమాస్‌కు అందించి, 2025కు శుభారంభం చేసింది. ఇక ఆపై, సంవత్సరం పొడవునా ఎన్నో విశేషాలు. హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో, శ్రీ పాలేకర్ ముఖ్య అతిథిగా, తరువాత మదనపల్లెలో విజయరాం గారు, ప్రకృతివనం ప్రసాద్ గారు, నరసింహారెడ్డి గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక సదస్సు నిర్వహణ ఒక చిరస్మరణీయ ఘట్టం! ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ గ్రామీణ్ మహోత్సవంలో పాల్గొనడం, ఆ కార్యక్రమంలో 'సహకార సంస్థలకు సాధికారత'పై నిర్వహించిన చర్చాగోష్ఠిలో ప్యానలిస్ట్‌గా ప్రాతినిధ్యం వహించడం ఒక చక్కని అనుభూతి. 2025 వ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ సహకారోద్యమ సంవత్సరం' గా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో, సహకార రంగాన్ని బలోపేతంచేసే అనేక ప్రత్యక్ష, పరోక్ష కార్యక్రమాలలో ఏపిమాస్ భాగస్వామ్యం వహించింది. సహకారోద్యమ సారథి కీర్తిశేషులు మామిడి రామారెడ్డి సంస్మరణ సభను ఏపిమాస్ నిర్వహించి, ఆయనకు ఘన నివాళులర్పించింది. మరో విశేషం పి4 లో మార్గదర్శక, నిర్వాహక పాత్ర. ప్రభుత్వం,ప్రేవేటు రంగం, ప్రజల భాగస్వామ్యంలో తగిన జీవనోపాధుల కల్పనతో, రాష్ట్రంలో పేదరికమనేదే లేకుండా చేయాలన్న మహదాశయంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు చేపట్టిన బృహత్ కార్యక్రమమైన పి4 లో భాగంగా, కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో, చిత్తూరు జిల్లా రామకుప్పంలో 'మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ' సంస్థ తోడ్పాటుతో 'బంగారు కుటుంబాలకు' భద్రమైన భవిష్యత్తును అందించే విశిష్ట సేవా కార్యక్రమ నిర్వహణ బాధ్యతను ఏపిమాస్ స్వీకరించింది. ఈ కార్యక్రమాలు ప్రాథమిక దశను పూర్తి చేసుకుని, యిప్పటికే చెప్పుకోదగినన్ని బంగారు కుటుంబాలకు జీవనోపాధులను సమకూర్చగలిగాయి. దీనితోపాటు యువత , మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను పెంపొందించుకోవడం కోసం అన్నమయ్య జిల్లా గోరంట్లపల్లిలో, కృష్ణాజిల్లా డోకిపర్రులో నైపుణ్య శిక్షణ కేంద్రాలను కూడా ఏపిమాస్ ఈ సంవత్సరంలోనే ఏర్పాటు చేసింది. బీహార్‌లో ఎఫ్ పి ఓల మహాసమ్మేళనం నిర్వహించడం, ఎఫ్ పి ఓలకు సమాఖ్యల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై చర్చలు సాగించడం ఎంతో సంతృప్తిని కలిగించాయి. ఇక, స్వయంసహాయ ఉద్యమంలో నెలకొన్న ఉదాసీనతను తొలగించి, ఉత్తేజాన్ని రగిలించడానికి 'ఉత్తమ స్వయం సహాయ సమాఖ్యలకు జాతీయ పురస్కారాల' పేరుతో నాలుగేళ్ళుగా సాగిస్తున్న బృహత్ యజ్ఞాన్ని ఏపిమాస్ ఈ ఏడాది, వరుసగా ఐదవ సంవత్సరం కూడా, మరింత స్ఫూర్తిదాయకంగా కొనసాగించింది. తెలంగాణాలోని జిల్లా సమాఖ్యలను బలోపేతం చేయడానికి తెలంగాణా సెర్ప్ తో అవగాహన ఒప్పందం కుదరడం స్వయంసహాయ ఉద్యమ పునరుజ్జీవానికి ఏపిమాస్ సాగిస్తున్న కృషికి మరింత శక్తిని యిచ్చింది. ఇలా, 2025 సంవత్సరం చిరకాలం గుర్తుంచుకోదగిన అనేక ఘట్టాలను అందించింది. మరో విశేషం ఏమిటంటే దాదాపుగా యివన్నీ 2026లో కూడా కొనసాగేవే! వీటితోపాటు, మహిళా రైతులకు తగిన ప్రాధాన్యత, సమాన ప్రాతినిధ్యం కల్పించాలంటూ ఏపిమాస్ ఎంతో కాలంగా అభిలషిస్తూ, అన్ని వేదికలపై ప్రస్తావిస్తూ వచ్చిన అంశాన్ని మరింత బలంగా ముందుకు తీసుకువెళ్ళే సదవకాశాన్ని 2026 యిస్తున్నది. ఎందుకంటే, 2026 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరం' గా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఇక, ఏపిమాస్ సేవా ప్రస్థానంలో వేవెలుగుల మహాపర్వంగా నిలిచే అమోఘ ఘట్టం 2026 లోనే ఆవిష్కృతం కానుంది. అదే ఏపిమాస్ రజితోత్సవం! ఈ కొత్త సంవత్సరం యింకా మరెన్నో విశిష్ట సేవలకు అవకాశాలను కల్పించగలదని ఆశిద్దాం.


**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12, HUDA Colony, Tanesha Nagar, Near DreamVally, Manikonda, Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**


మనసు అయస్కాంతంలా ఆకర్షిస్తుంది ; మంచి కోరుకుంటే మంచిని, చెడు కోరుకుంటే చెడును...

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం: క్రిస్టాఫర్ వసంత్**

## లోపలి పేజీలలో ....

- సహకార ఉద్యమమే ఊపిరిగా శ్రీ రామారెడ్డి! 05
- వ్యాపారాత్మక సంస్థలుగాసహకార సంఘాలు ... 08
- 'విజయ' పథంలో ప్రకృతి వ్యవసాయం! 10
- పి4 ఫలాలందుకుంటున్న బంగారు కుటుంబాలు 13
- పండ్ల ఉత్పత్తిలో అగ్రపీఠాన ఆంధ్రప్రదేశ్ ! 15
- ఆహారాన్ని అందించే 'భూమి ఓల్డ్ స్కూల్ ఫుడ్స్' 16
- ముగ్గురు తెలుగుతేజాలకు రాష్ట్రీయ బాలపురస్కార్ 18
- ఉప్పొంగిన ఉపాధి అవకాశాల గ్లోబల్ సమ్మిట్ 20
- మహిళా సాధికారతలో తెలంగాణా 22
- తప్పిపోతున్న బాలికల సంఖ్య పెరుగుతోంది 23
- మేలుజాతి వరిరకాలు: తెల్లసన్నాలు... 24
- ఇంధన పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ ప్రథమం 25
- ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా సంస్థగా 'శ్రీజ' 26
- టమాటాలో బొడ్డు, పూత కుళ్ళు నివారణ 28
- 'అనంత'లో యాపిల్ సాగు ప్రయోగం సఫలం 29
- గుండెపోటు ముప్పును పెంచే చలికాలం... 30
- డ్వాక్రా బజార్‌లో రూ.19 కోట్ల అమ్మకాలు 32
- స్వయంసహాయ మహిళలకు రివాల్వింగ్‌ఫండ్ 33
- ప్రధాని మెప్పుపొందిన నరసాపురం లేసులు 34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన చార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

ఆందోళన పడితే ఏ సమస్యా పరిష్కారం కాదు, ఏ పరిష్కారమైనా ప్రశాంతమైన ఆలోచనతోనే సాధ్యం

# సహకార ఉద్యమమే ఊపిరిగా జీవించిన శ్రీ రామారెడ్డి!

## ఏపిమాస్ నిర్వహించిన సంస్మరణ సభలో వక్తల ఘన నివాళి

ఇటీవల దివంగతులైన సహకార ఉద్యమ సారథి శ్రీ మామిడి రామారెడ్డి సంస్మరణ సభ 2025 డిసెంబర్ 2 న హైదరాబాదులో ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ లోని వటోడియా ఆడిటోరియంలో ఏపిమాస్ నిర్వహణలో జరిగింది. సహకార ఉద్యమానికి, గ్రామీణ అభివృద్ధికి ఆయన చేసిన అమూల్య సేవలను స్మరించుకుంటూ, ఆయన చిత్రపటానికి పుష్పాంజలితో కార్యక్రమం ప్రారంభమైంది. శ్రీమతి జయప్రద (సిడిఎఫ్), శ్రీ భాలే రావు (ఐఏఎస్ -రిటైర్డ్), శ్రీ కృష్ణ గోపాల్, శ్రీమతి సంధ్యారాణి, శ్రీ జయప్రకాశ్ నారాయణ, (ఐఏఎస్-రిటైర్డ్), ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి.ఎస్. రెడ్డి, బోర్డు సభ్యులు శ్రీ మోహనయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి ఆయన చిత్రపటంవద్ద పుష్పాలు సమర్పించి, నివాళులర్పించారు.



**ఒక తీర్థయాత్ర, ఒక ప్రేరణ ...**

సభను ఉద్దేశించి మాట్లాడిన ఏపిమాస్ సీఈఓ శ్రీ సి.ఎస్.రెడ్డి గారు, పాల్గొన్న వారందరికీ స్వాగతం పలికి, దివంగత శ్రీ మామిడి రామారెడ్డిగారితో తనకు ఉన్న దీర్ఘకాలిక అనుబంధాన్ని, స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. సహకార రంగంలో, పొదుపు ఉద్యమంలో తాము కలిసి పనిచేసిన సందర్భాల్లో ఆయనను సన్నిహితంగా అవగాహన చేసుకునే అవకాశం తనకు కలిగిందని అన్నారు. వరంగల్‌లో జరిగిన తమ తొలి పరిచయాన్ని ప్రస్తావిస్తూ, సహకార ఉద్యమంపై ఆయన చూపిన ప్రగాఢ ప్రభావాన్ని గుర్తు చేసుకున్నారు.

గత 25 సంవత్సరాలుగా ఏపిమాస్ స్వయం సహాయ ఉద్యమంలో స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జి)తో, ఎస్‌హెచ్‌జి సమాఖ్యలతో సన్నిహితంగా పని చేస్తోందని, ఈ ఉద్యమం ఈనాడు ఇంత విస్తృతిని, ఆర్థిక సమున్నతిని సాధించిందంటే, దానికి అసలైన బలం దృఢమైన సహకార విలువలేనని ఆయన పేర్కొన్నారు. శ్రీ రామారెడ్డి నెలకొల్పిన 'సహ వికాస'ను సందర్శించడం అర్థవంతమైన అవగాహనతో ఎప్పటికప్పుడు మన సామర్థ్యాన్ని మెరుగుపరిచే ఒక తీర్థ యాత్రలా అనిపించేదని పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జిలకు బలమైన పునాది వేసిన సంస్థగా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (సి డి ఎఫ్) ను ప్రశంసిస్తూ, ముల్కనూరు సందర్శన ఎల్లప్పుడూ ప్రేరణనిచ్చేదని చెప్పారు.

శ్రీ రామారెడ్డి గారు ప్రజాసంస్థల సామర్థ్యాభివృద్ధికి, వాటి బలోపేతానికి నిరంతరం కృషి చేశారని ఆయన నివాళులర్పించారు. సహకార సంస్థలను ఏర్పాటు చేసుకునే హక్కును గుర్తించిన 97వ రాజ్యాంగ సవరణ ప్రాముఖ్యతను, సహకార సంస్కరణలు విస్తృతంగా అమలు కావడానికి దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను, వివిధ హైకోర్టుల్లో జరిగిన న్యాయపరమైన పరిణామాలను గుర్తుచేస్తూ, ఈ విషయమై శ్రీ రామారెడ్డి నిర్వహించిన కీలక పాత్రను ఆయన ప్రస్తావించారు. ఎన్జీఓల ప్రోత్సాహంలో ప్రభుత్వ నియంత్రణ ఉండకూడదన్నది శ్రీ రామారెడ్డి గారి దృఢమైన అభిప్రాయమని తెలిపారు.

రామారెడ్డి గారితో కలిసి పని చేసే అవకాశం తనకు లభించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయనను "సాత్విక యోధుడు, అంకితభావంతో కూడిన నాయకుడు, ముఖ్యంగా మంచి మనిషి" అంటూ శ్రీ సి ఎస్ రెడ్డి అభివర్ణించారు.

అనంతరం సహవికాస బృందానికి చెందిన శ్రీ లక్ష్మణ్

పట్టుదలతో అవగాహన, ఆపై అభ్యాసం , నేర్చుకున్నదానికి మెరుగులు దిద్దడం ... ఇదీ విజయ రహస్యం

దివంగత శ్రీ రామారెడ్డి గారికి అంకితంగా ఒక గీతాన్ని ఆలపించారు.

**వీడియో ప్రదర్శన**

సంస్మరణ కార్యక్రమంలో భాగంగా, దివంగత శ్రీ రామారెడ్డి గారి వ్యక్తిగత జీవితం, సేవా జీవితంపై 15 నిమిషాల విడియోను ప్రదర్శించారు. ఈ వీడియోలో ఆయన వ్యక్తిగత నేపథ్యం నుంచి సహకార రంగంలో చేసిన విప్లవాత్మక సేవల వరకు సమగ్ర చిత్రాన్ని అందించారు. తండ్రి న్యాయవాది అయినప్పటికీ, శ్రీ రామారెడ్డి ఆ వృత్తిని చేపట్టలేదని, చిన్న వయస్సు నుంచే ప్రగతిశీల సహకార ఆలోచనల ప్రభావానికి లోనయ్యారని విడియోలో చూపించారు.

ముల్కనూరు సహకార సంఘం స్థాపనతో ఆయన సేవల ప్రారంభాన్ని వివరించి, అది దేశవ్యాప్తంగా ఒక ఆదర్శ నమూనాగా ఎలా మారిందో చూపించారు. కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (సి డి ఎఫ్) స్థాపన, క్రెడిట్ యూనియన్ల ప్రారంభం, స్వయం సహాయ సంస్థల ప్రోత్సాహం ద్వారా ప్రజల నిర్వహణలోని వ్యవస్థలను బలోపేతం చేయడమే ఆయన లక్ష్యమని వివరించారు.

అభివృద్ధికి ప్రజలే నాయకత్వం వహించగలరన్న ఆయన నమ్మకాన్ని, అనేక సంఘాలు నిర్వీర్యంగా ఉన్న కాలంలో కూడా సహకార సంస్థలకు అధిక అధికారాలు ఇవ్వడం, కొత్త సహకార సంస్థల ఏర్పాటు, ప్రత్యేక సహకార చట్టం రూపకల్పన వంటి అంశాలను విడియో హైలైట్ చేసింది.

చివరగా, సహకార ఉద్యమం సాధించిన సానుకూల ఫలితాలను గురించి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, శ్రీమతి సంధ్య చేసిన వ్యాఖ్యలతో విడియోను ముగించారు.

**రామారెడ్డి చేసిన సేవలు**

విడియో ప్రదర్శన అనంతరం, శ్రీ రామారెడ్డి గారితో తమకు వున్న అనుబంధాల స్మృతులను పంచుకునే భావోద్వేగ పూరిత ప్రసంగ ఘట్టం ప్రారంభమైంది.

మొదటగా శ్రీమతి జయప్రద గారు, ఆయన మరణం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, సహకార రంగానికి, ఎస్‌హెచ్‌జి ఉద్యమాలకు ఆయన చేసిన అపార సేవలను గుర్తు చేశారు. 1990లో ఒక్కొక్కరి నుంచి రూ.10 పొదుపుతో ప్రారంభమైన ప్రయాణం కాలక్రమేణా ఈ ప్రయోగం మంచి అవగాహనతో విస్తృత ఆమోదం పొందిందని ఆమె చెప్పారు. కోట్ల రూపాయల నిధులు నిర్వహించినప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ నేలపై నిలబడి క్షేత్రస్థాయి కార్యకర్తలతో కలిసి పని చేశారని పేర్కొన్నారు. సమయపాలన ఆయన అత్యంత ముఖ్యమైన వ్యక్తిగత విలువలలో ఒకటని చెప్పారు. వేలాది ఎస్‌హెచ్‌జిలు, సమాఖ్యల ద్వారా సాధించిన అసాధారణ విజయాలను, ఇంగ్లీష్ భాషపై ఆయనకు ఉన్న పట్టును, గ్రామీణ ప్రజలతో సులభంగా మమేకమయ్యే గుణాన్ని ప్రశంసించారు. జ్ఞాన, కర్మ మార్గాలలో ప్రజలకు మార్గ నిర్దేశం చేసిన శ్రీకృష్ణుడితో ఆయనను పోల్చారు. ప్రారంభ దశలో ముల్కనూరు సహకారానికి ఏ బ్యాంకు రుణం ఇవ్వడానికి ముందుకు రాలేదని, ప్రస్తుతం కొత్త సమూహాల ఏర్పాటే ప్రధాన సవాలుగా మారిందని చెప్పారు.

తదుపరి శ్రీ భాలే రావు మాట్లాడుతూ, శ్రీ రామారెడ్డితో దాదాపు 35 సంవత్సరాల తన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయనతో గడిపిన ప్రతి సందర్భం తనకు ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. సహకార సంస్థలలో వాటా ధనానికి వడ్డీ లేకపోయినా, ఆసుపత్రులు, సేవా సంస్థల వంటి భారీ సంస్థలను నిర్మించగలిగిన నమూనా ఇదేనని చెప్పారు. మాక్స్ (యం ఎ సి ఎ) చట్టం అనుభవం నుంచి ఇతర రాష్ట్రాలు నేర్చుకున్నప్పటికీ, పూర్తిగా అమలు చేయలేదని తెలిపారు. సహవికాస బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీమతి నందితా రే గారు, ఆయనది ఒక అరుదైన వ్యక్తిత్వంగా అభివర్ణిస్తూ, సహకార చట్టం ప్రజాసంస్థలకు గొప్ప వరమని అన్నారు. ఆయన మౌనస్వభావం, సరళత, నిబద్ధత అందరిపై చెరగని ముద్ర వేసిందని గుర్తు చేశారు.

శ్రీ కృష్ణ గోపాల్ గారు, మూడు సంవత్సరాల పాటు శ్రీ రామారెడ్డితో కలిసి పనిచేసిన తన అనుభవాలను పంచుకుంటూ, స్పష్టమైన ప్రజెంటేషన్లకు, ముందస్తు

సంసిద్ధతకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను వివరించారు. మౌలిక వసతుల ప్రాముఖ్యత, సమయపాలన, సంస్థాగత పరిపాలనలో ఆయన పాటించిన విశిష్ట రీతులను ప్రశంసిస్తూ, ఆయనను “ఆచార్యుడు”గా పేర్కొన్నారు.

శ్రీమతి సంధ్యారాణి గారు, తాను ఒకసారి బోర్డు సమావేశానికి ఆలస్యంగా వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకుని, ఆయన క్రమశిక్షణ తనపై చూపిన ప్రభావాన్ని చెప్పారు. ప్రజల నాయకత్వంలోని సంస్థలకే ఆయన మద్దతు ఉండేదని, ప్రభుత్వ నిధులతో పొదుపు, సహకార సంస్థల ప్రోత్సాహానికి ఆయన వ్యతిరేకమని వివరించారు. ఆలోచనలను కార్య రూపంలోకి తేవడమే ఆయన దృక్పథమని సమీక్షించారు.

ఆయన కుమార్తె డా. అరుణిమ గారు భావోద్వేగంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. సినిమాలు చూడటం, ప్రయాణాలు, విద్యా–వృత్తి ఎంపికల్లో తండ్రి తనకు యిచ్చిన స్వేచ్ఛను గుర్తు చేసుకున్నారు. తన తండ్రి అమెరికాలో వున్న కాలంలో దేశ సేవకోసం స్వదేశానికి తిరిగి రావాలని తపనపడ్డారని, కాని, తాను ఉద్యోగంకోసం అమెరికా వెడితే, తనను తిరిగి రమ్మని ఆయన ఒత్తిడి చేయలేదని, సంతానానికి ఆయన యిచ్చిన స్వేచ్ఛ అటువంటిదని ఆమె తెలిపారు. ఆయన కు వయసు మీరిన తర్వాత ఆయనతో గడిపే అదృష్టం తనకు కలిగిందని, ఆయన యిష్టాలు చాలా చిన్నవని, పిజ్జా, ఐస్‌క్రీమ్ అంటే ఆయనకు చాలా యిష్టమని ఆమె గుర్తుచేసుకున్నారు. బాలికలకోసం ఆయన ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసిన విషయాన్ని వివరించారు. ఆయన ఆశయాల కార్యాచరణ కొనసాగగలదన్న ఆకాంక్షను ఆమె వ్యక్తంచేశారు.

ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు గారు, ఆయన క్రమశిక్షణను, సౌమ్యతతో కూడిన బలమైన నిశ్చితాభిప్రాయ స్వభావాన్ని ప్రశంసిస్తూ, సమాజానికి యిలాంటి వ్యక్తులు ఎంతగానో అవసరమన్నారు.

చివరిగా డా. జయప్రకాశ్ నారాయణ, శ్రీ రామారెడ్డి గారితో తనకు వున్న 45 ఏళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన ప్రభావం తరతరాల పాటు కొనసాగుతుందని అన్నారు. సహకార ప్రజాస్వామ్యానికి ఆయన చూపిన మార్గం భారత్‌కు ఆదర్శమని చెప్పారు.

ఆత్మపరిశీలనాత్మక, ప్రేరణాత్మక వాతావరణంలో కార్యక్రమం ముగిసింది. దివంగత శ్రీ మామిడి రామారెడ్డి గారు ప్రతిపాదించిన విలువలను, దృక్పథాన్ని కొనసాగించాలన్న సంకల్పాన్ని ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పునరుద్ఘాటించారు. ■

### మహిళా సాధికారతలో యూరోపియన్ దేశాల ముందంజ!

మహిళలు స్వేచ్ఛగా, సురక్షితంగా జీవించడానికి, సమాన అవకాశాలతో ఉన్నత శిఖరాలనధిరోహించడానికి ప్రపంచంలో అత్యుత్తమ దేశాలుగా యూరోపియన్ దేశాలు మరోసారి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించి, తొలి ఏడు స్థానాల్లో కొలువుదీరాయి. జార్జిటౌన్ ఫర్ ఉమెన్, పీస్ అండ్ సెక్యూరిటీ, పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఓస్లో సంయుక్తంగా విడుదల చేసిన ‘ఉమెన్ పీస్ అండ్ సెక్యూరిటీ (డబ్ల్యూపీఎస్) ఇండెక్స్ 2025–26 నివేదిక ఈ వివరాలను వెల్లడించింది.

**అగ్రపీఠంపై డెన్మార్క్**

ఈ జాబితాలో 0.939 స్కోర్‌తో డెన్మార్క్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత 0.932 స్కోర్‌తో ఐస్‌లాండ్ రెండో స్థానంలో ఉంది. ఇక 0.924 స్కోర్‌తో నార్వే, స్వీడన్ సంయుక్తంగా మూడో స్థానాన్ని పంచుకున్నాయి. ఫిన్‌లాండ్ (0.921), లక్జెంబర్గ్ (0.918), బెల్జియం (0.912) వరుసగా 5,6,7 స్థానాల్లో నిలిచాయి.

మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అద్భుతమైన అవకాశాలు, పార్లమెంటులో అధిక మహిళా ప్రాతినిధ్యం, మెరుగైన విద్య, ఆర్థిక స్వేచ్ఛకు, వివక్షకు వ్యతిరేకంగా పటిష్టమైన చట్టాలు, బలమైన సంక్షేమ పథకాలు, తక్కువ ఖర్చుతో శిశు రక్షణ, సురక్షితమైన పబ్లిక్ ప్రదేశాలు, లైంగికహింస చాలాతక్కువగా ఉండటం, ఉన్నత యాజమాన్యాల్లో మహిళలకు పెద్దపీట వేయడంతోపాటు బలమైన కార్మిక సంఘాలు, సమాన వేతన చట్టాల వంటివి ఈ దేశాలను జాబితాలో ముందు వరుసలో నిలబెట్టాయి. ■

# సహకార సంఘాలు వ్యాపారాత్మక సంస్థలుగా మారాలి

– డా. రమాదేవి

**స**హకార సంఘాలను దానధర్మ సంస్థలుగా కాకుండా వ్యాపారాత్మక సంస్థలుగాచూడాలని, అవి ఆ విధంగా తమను తాము మార్చుకోవాలని బెంగళూరు ఐ ఐ ఎం ప్రొఫెసర్, సి సి డి(సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్మెంట్) వ్యవస్థాపకులు ప్రొఫెసర్ త్రిలోచన్ శాస్త్రి పేర్కొన్నారు. అమూల్, ముల్కనూర్ వంటి విజయవంతమైన సహకార నమూనాలను ఉదాహరిస్తూ, రైతులు తమ సంస్థలపై పూర్తి యాజమాన్య భావన కలిగి ఉండాలని ఆయన సూచించారు.

ప్రస్తుతం ఎఫ్ పి ఓ ల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలలో, ఎఫ్‌పిఓల పట్ల అనుసరిస్తున్న విధానాల్లో అధిక నియంత్రణలు ఉండటం వల్ల రైతుల స్వతంత్రత దెబ్బ తింటోందని, నియమాలు, కట్టుబాట్ల మాటున స్వయంకృషి, స్వయం సామర్థ్యం నీరుగారుతున్నాయని ఆయన విమర్శించారు.




హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో 2025డిసెంబర్ 24న నిర్వహించిన 'స్మరజిత్ రే స్మారకోపన్యాసం' లో ఆయన ' రైతుల సుసంపన్నత కోసం సుస్థిరమైన, క్రమాభివృద్ధి సాధించే సహకార సంస్థల, ఎఫ్ పి ఓ ల నిర్మాణం' (ఎస్టాబ్లిషింగ్ స్కేలబుల్ అండ్ సస్టైనబుల్ కోఆపరేటివ్స్ అండ్ ఎఫ్ పి ఓస్ ఫర్ ఫార్మర్స్ ప్రాస్పరిటీ) అనే అంశంపై ప్రధాన ప్రసంగం చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్య కార్యదర్శిగా పని చేసిన దివంగత శ్రీ స్మరజిత్ రే (రిటైర్డ్) భారతదేశ గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, సామాజిక సంస్థల నిర్మాణంలో చేసిన విశేష, విశిష్ట కృషికి నృత్యంజలి సూచకంగా, 'రే స్మారక ప్రసంగ శ్రేణి' ని ఏపిమాస్ 2006 లో ప్రారంభించింది.

ఈ సీరీస్‌లో భాగంగా ఈ సంవత్సరం 'ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని (2025)' పురస్కరించుకొని, మెరుగైన, సమ్మిళిత, సుస్థిరాభివృద్ధి ప్రపంచాన్ని నిర్మించడంలో సహకార సంస్థల పాత్రను గుర్తు చేస్తూ, స్మరజిత్ రే స్మారక ఉపన్యాసాన్ని నిర్వహించడం జరిగింది.

**ఎఫ్‌పిఓల సవాళ్ళు**

భారతదేశంలో ఎఫ్‌పిఓల (రైతు ఉత్పత్తిదారుల సంస్థల) సవాళ్లు, సామర్థ్యాల గురించి ప్రస్తావిస్తూ, ఎఫ్‌పిఓలు కేవలం రైతుల యాజమాన్యంలో, నిజమైన వ్యాపార నమూనాలుగా పని చేయ వలసిన ఆవశ్యకతను శ్రీ త్రిలోచన్ శాస్త్రి వివరించారు. అదే సమయంలో బ్యాంకు నిధులు, ప్రభుత్వ తోడ్పాటు, స్థానిక నాయకత్వ ప్రాముఖ్యత వంటి అంశాలను కూడా విస్మరించరాదని ప్రొఫెసర్ శాస్త్రి పేర్కొన్నారు.

ఎఫ్‌పిఓలు నేరుగా పరిశ్రమలకు అమ్మకాలపై దృష్టి పెట్టాలని, గ్రాంట్లపై ఆధారపడటాన్ని తగ్గించాలని, సుస్థిరత్వం, క్రమాభివృద్ధిని నిర్ధారించడానికి వ్యాపార తరహా విధానాన్ని అవలంబించాలని సూచించారు.

ఇంతేకాకుండా, ఎఫ్‌పిఓల ప్రోత్సాహక సంస్థల మధ్య పరస్పర సహకారం ఎంతైనా అవసరమని, ఎఫ్‌పిఓలకు తోడ్పాటు అందించే విధానపరమైన సానుకూల వాతావరణం అవసరమని ఆయన అన్నారు.

విజయంలో వినయం, పరాజయంలో సహనం ... ఇదే జీవన సూత్రం, వ్యక్తిత్వానికి కొలమానం

**రైతు వ్యాపార సామర్థ్యాన్ని గుర్తించాలి**



తక్కువ రాబడి, ప్రతికూల వాతావరణ ప్రభావాల వంటి చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, రైతులను వ్యాపారవేత్తలుగా గుర్తించి, వారిపై నమ్మకం ఉంచాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ శాస్త్రి పేర్కొన్నారు. ఆహారరంగంలో లాభాలు విరివిగా ఉన్నాయనడానికి ఈ రంగంలో విరివిగా పెరుగుతున్న ప్రైవేట్ పెట్టుబడులే రుజువు అని, ఈ ధోరణిని రైతులు సహకార సంఘాల ద్వారా తమకు అనుకూలంగా, మార్చుకుని, అభివృద్ధి చెందాలని ఆయన అభిప్రాయపడ్డారు.

చైనా, తదితర దేశాల సహకార సంఘ నమూనాలతో భారత పరిస్థితిని పోల్చుతూ, జాతీయ స్థాయిలో ఒక స్పష్టమైన మిషన్ విధానం అవసరమని ప్రొఫెసర్ శాస్త్రి సూచించారు. రైతులపై నమ్మకం, విధానాల్లో సడలింపులు, కొన్ని వైఫల్యాలను స్వీకరించే ధైర్యం ఉంటేనే పెద్ద విజయాలు సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

**స్మరజిత్ రే ఆశయాలకు నివాళి**

అంతకు ముందు, దీప ప్రజ్వలనంతో ప్రారంభించబడిన ఈ కార్యక్రమంలో స్మరజిత్ రే గారి భార్య శ్రీమతి నందితా రే మాట్లాడుతూ, స్మరజిత్ రే గారు ఇతరుల ఆర్థిక సహాయం కంటె స్వావలంబనపై నమ్మకం ఉంచే వారని, తమ సమస్యల పరిష్కార మార్గాలను కనుగొనే సామర్థ్యం పేదలకు ఉందని విశ్వసించేవారని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపిమాస్ ఛైర్మన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ప్రధాన కార్యదర్శి శ్రీ కాకి మాధవరావు దివంగత స్మరజిత్ రేతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వంలో ఎంతో ఆకర్షణీయమైన పదవులను వదులుకుని, అభివృద్ధి రంగంలో పనిచేయాలనే ఆయన అభిరుచిని కొనియాడారు.

**ప్రభుత్వం-ఎన్‌జీఓల భాగస్వామ్యం**

ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సిఎస్ రెడ్డి మాట్లాడుతూ, "శ్రీ స్మరజిత్ రే తన సుదీర్ఘ ప్రభుత్వ సేవలో, స్వచ్ఛంద సేవా రంగానికి మార్గదర్శక పాత్ర పోషించారని, ప్రభుత్వం-ఎన్ జి ఓ ల సహకారాన్ని బలోపేతం చేయడానికి ఆయన విశేష కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం మౌలిక వసతులు సమర్థంగా సమకూర్చగలిగితే, ఎన్‌జీఓలు సామాజిక సమీకరణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. స్మరజిత్ రే గారి ఆలోచనలకు అనుగుణంగా, సహకార సంఘాల స్థిరత్వం, విస్తరణపై నిరంతర కృషి అవసరమని" ఆయన అభిప్రాయపడ్డారు.

వ్యవసాయం ప్రధాన వృత్తి, ముఖ్య జీవనోపాధి అయిన మన దేశ ఆర్థికాభివృద్ధి పథంలో వ్యవసాయం, సహకార సంఘాల కీలకపాత్రను, సహకార సూత్రాల ప్రాముఖ్యతను శ్రీ సి.ఎస్. రెడ్డి విశదీకరించారు. సహకార సంఘాలలో, ఎఫ్ పి ఓ లలో ప్రజాస్వామ్య పనితీరు, పారదర్శకత అవసరాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఎఫ్ పి ఓ లు రైతుల ఆదాయాలను మెరుగుపరచాల్సిన అవసరాన్ని, వ్యవసాయం నుండి యువ రైతులు వెనుకాడుతున్న ధోరణిని నివారించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమం ప్రత్యక్షంగా, పరోక్షంగా(హైబ్రిడ్ మోడ్‌లో) నిర్వహించబడింది. వివిధ ఎన్ జి ఓల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు, అభివృద్ధి రంగ నిపుణులు, సాగర్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు, ఏపిమాస్ సిబ్బంది పెద్ద సంఖ్యలోఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓట్ ఆఫ్ థాంక్స్‌తో కార్యక్రమం ముగిసింది.

■

సమస్యలకు, సవాళ్లకు నీవు మొహం చాటుచేస్తే, విజయమూ నీకు మొహం చాటుచేస్తుంది

# 'విజయ' పథంలో ప్రకృతి వ్యవసాయం!

– జె వి క్రిష్ణమూర్తి

విజయరామ్ ! ఇప్పుడిది ఉభయ తెలుగు రాష్ట్రాలలో సహజ వ్యవసాయం పట్ల ఆసక్తి కలిగిన రైతులకు తారకనామంగా మారిన పేరు! ప్రకృతి వ్యసాయానికి చిరునామాగా మారిన పేరు! ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో మచిలీపట్నానికి సమీపంలోని తరకటూరు అనే చిన్న గ్రామంలో, తెలంగాణాలో వికారాబాద్ సమీపంలో ఆయన నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు యిప్పుడు రైతులకు, పరిశోధకులకు, శాస్త్రవేత్తలకు పర్యాటక క్షేత్రాలుగా మారాయనడం అతిశయోక్తి కాదు.



నిజానికి, ఆయనది వ్యవసాయ కుటుంబం కాదు. పుట్టింది కృష్ణాజిల్లా కలిదిండిలో. వాళ్ళు నలుగురు సోదరులు. తండ్రి సహకార సంఘాల రిజిస్ట్రార్. తండ్రిగారి ఉద్యోగరీత్యా మచిలీపట్నం (బందరు), విజయనగరంలలో గడిపారు. మచిలీపట్నం హిందూ కళాశాలలో ఉన్నత విద్యాభ్యాసం. అన్నగారి కోరిక మేరకు, ప్రసిద్ధమైన 'బందరు లడ్డు'ను తెలంగాణా వాసులకు రుచి చూపించాలని హైదరాబాదులో మిఠాయి దుకాణం ప్రారంభించారు. ఆలా దశాబ్దం గడిచింది.

ఒక్కసారిగా ఊహించని మార్పు! దాదాపు 15 ఏళ్ళ క్రితం ఆయన, 'ఆధునిక ప్రకృతి వ్యవసాయ పితామహుడు'గా పేర్కొనదగిన శ్రీ సుభాష్ పాలేకర్ వ్యవసాయ శిక్షణ సదస్సులో పాల్గొనడం జరిగింది. ఆ సదస్సు ఆయనను ఎంతగా ఆకట్టుకున్నదంటే, వెనువెంటనే ఆయన రైతుగా, ఆదర్శ రైతుగా మారిపోయాడు! అంతేకాదు, తన జీవితాన్నే పూర్తిగా ప్రకృతి వ్యవసాయానికి అంకితం చేశాడు. రసాయనిక వ్యవవసాయం తో భూమాతకు జరుగుతున్న అపచారం, ఆ పంటలు ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్న తీరు, అనాదిగా సహజ వ్యవసాయానికి మూలాధారమైన గోమాతను బొత్తిగా విస్మరిస్తున్న ధోరణులు ఆయన మనసును కలచివేశాయి. వ్యవసాయం తీరుతెన్నులు పూర్తిగా మారిపోవాలని, తాతలనాటి సహజ వ్యవసాయానికి మళ్ళీ మళ్ళాలని ఆయన ఆశపడ్డారు. కాని, ఆ ఆశ నెరవేరేదెలా?

కొన్ని దశాబ్దాలుగా రసాయనిక వ్యవసాయానికి అలవాటుపడిన రైతాంగంలో మార్పు రావడం అంత సులభమా? సహజ ఎరువులతో, దేశవాళీ విత్తనాలతో దిగుబడి బాగా తక్కువగా వుంటుందని, రసాయనిక ఎరువులు, హైబ్రిడ్ విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధ్యమన్న అపోహ జీర్ణించుకు పోయిన రైతులు, గోఆధారిత ప్రకృతి వ్యసాయంద్వారా అంతకంటె మించి ఆదాయం ఆర్జించవచ్చునని కేవలం మాటలు చెబితే వింటారా? వాస్తవానికి అధిక దిగుబడులన్న పటాటోపమే కాని, ఖర్చులు పెరిగి, పెట్టుబడులకు తగ్గట్టుగా ఆదాయం రాక, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వారు, ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు ఎందరో వున్నారు. మార్పు రావాలంటే, వారికి రుజువు కావాలి, నమ్మకం కుదరాలి. అప్పుడే వారు భవ్యమైన, భద్రమైన బతుకును హామీయిచ్చే ప్రకృతి వ్యవసాయంవైపు మళ్ళగలుగుతారు.

ఆ ఆలోచనతో, తాను స్వయంగా ప్రకృతి వ్యవసాయం చేసి, నిజం నిరూపించాలని శ్రీ విజయరాం రైతుగా మారారు. ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణాలో కలిపి మొత్తం 56 ఎకరాలలో ఆయన ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. తరకటూరులో దాదాపు 12 ఎకరాలు, వికారాబాద్ వద్ద 44 ఎకరాల చవిటి భూములు యిప్పుడు ప్రకృతి ఒడిలో సుక్షే త్రాలుగా మారాయి.

మనిషిని ముందుకు నడిపించేవి ఆసక్తి , భయం

రైతుగా శ్రీ విజయరాం పరిణామం కేవలం ఆషామాషీ కాదు, ఆయన త్రికరణ శుద్ధిగా సహజ కర్షకునిగా, ప్రకృతి ఆరాధకుడిగా, దేశవాళీ గోవుల సంరక్షకునిగా, సంస్కృతీ సంప్రదాయ పరిరక్షకునిగా, గోఆధారిత వ్యవసాయ నిత్య ప్రచారకునిగా మారారు!

2025 డిసెంబర్ నెల రెండవ పక్షంలో తరకటూరులోని తన వ్యవసాయ క్షే త్రంలోఉభయ తెలుగు రాష్ట్రాలలోని 23 జిల్లాలకు చెందిన రైతులకు ఆయన ప్రకృతి వ్యవసాయ శిక్షణ శిబిరం నిర్వహించారు. డిసెంబర్ 25 వ తేదీన ఆ శిబిరాన్ని పరిశీలించడానికి ఈ వ్యాస రచయిత వెళ్ళినపుడు, కృష్ణా జిల్లా నుంచి దాదాపు 200 మంది రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. వారిలో యువకులు, వయసు పైబడినవారు, మహిళలు ... అందరూ వున్నారు. కాని, పురుషులలో ఒక్కరు కూడా రైతు వస్త్రధారణలో లేరు. పంచెకట్టు, ఉత్తరీయం పూర్తిగా కనుమరుగైనాయి. అందరూ ప్యాంట్లు, షర్టులే. ఒక్క విజయరాం గారు మాత్రమే ముమ్మూర్తులా రైతు ఆహార్యంతో వారందరికీ భిన్నం! పంచె కట్టు, చేతుల బనీను, ఉత్తరీయం, పెరిగిన గడ్డం ... యిదీ ఆయన రూపం. అప్పుడే కాదు ఎప్పుడూ. ఆవు పేడతో చేసిన పిడకలతో చిన్నపాటి హోమం, దైవారాధన, శంఖారావ పూర్వకంగా ప్రకృతికి నైవేద్య నివేదనతో ఆయన శిక్షణ శిబిరం ప్రారంభమవుతుంది.

**ఖర్చులేని (జీరో బడ్జెట్) ఐదు దొంతర్ల వ్యవసాయం**

రైతులందరూ కేవలం వరి సాగు చేయాలని ఎగబడితే ఎలా? వరికి ఎంత నీరు కావాలో, ఎంత పెట్టుబడి అవసరమో, ఎంత ఆదాయం వస్తుందో, వరి అన్నం తినే వారెంతమందో, ఎంత పంట అవసరమో ... యివేవీ పట్టించు కోకుండా, ఆలోచించకుండా, గిరిగీసుకున్నట్టు వరిసాగు సాగిస్తూ, తగిన ఆదాయం రాక రైతులు కష్టనష్టాలపాలవు తున్నారు. వేలంవెర్రిగా వరిసాగువల్ల రసాయనికాలతో భూమితల్లి సారహీనమవుతున్నది. పర్యావరణం కలుషితమవు తున్నది. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

వీటన్నిటికి పరిష్కారం 'ఖర్చులేని (జీరో బడ్జెట్) ప్రకృతి వ్యవసాయం! ప్రకృతి వ్యవసాయంలో వరి సాగుకు కేవలం మూడవ వంతు నీరు చాలు. నేడు మనం చూడని, వినని

## ఎకరం పొలంలో 3 లక్షల ఆదాయం!

**'మీ**కు పొలాలు వుంటే రండి, శిక్షణ యిస్తాము. మీ పిల్లలకోసం, మనవళ్ళకోసం, వ్యవసాయం చెయ్యాలని, మన రాష్ట్రం ఆరోగ్యంగా వుండేలా మనమందరం మానవ ప్రయత్నం చేయాలని కోరుకుంటున్నాం. ఒక ఎకరంలో 3 లక్షల ఆదాయం నమూనా సిద్ధంగా వున్నది'. ఇదీ విజయరాం గారి సందేశం, ఆహ్వానం. శ్రీ విజయరాం చెప్పిన కొన్ని ఉదాహరణలు ...

### కుంకుడు

తెలంగాణాలోని నల్లగొండ జిల్లాలో శ్రీమతి పద్మారెడ్డి అనే మహిళా రైతు కుంకుడు సాగు సాగిస్తూ, మంచి ఆదాయం సాధిస్తున్నారు. ఒకటీ, అరా కాదు, ఏకంగా 30 ఎకరాలలో ఆమె కుంకుడు పండిస్తున్నారు. ఎకరానికి లక్ష రూపాయలకు తగ్గకుండా సంపాదిస్తున్నారు.

### మునగ

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో శ్రీమతి అరుణ అనే మహిళా రైతు మునగ సాగు చేస్తున్నారు. అది 20 ఎకరాలతో మొదలై యిప్పుడు 100 ఎకరాలకు విస్తరించింది. ఏడాదికి 12 టన్నుల మునగపొడి ఎగుమతి చేస్తూ, లక్షలు ఆర్జిస్తున్నారు. మునగ ఆకులతోనే కాదు, ఆకు రెమ్మల పొడి కూడా ఆమెకు ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నది.

### వెదురు

వెదురు అడవులకే పరిమితం కాదు, పొలాలలో కూడా పెంచుకోవచ్చు. దానికి గడ్డి జాతి మొక్కగా గుర్తింపు యిచ్చారు. వెదురులో 150 రకాలు వున్నాయి. సుదీర్ఘకాలం ఆదాయం యిచ్చే పంట యిది. ఎకరానికి లక్ష నుంచి లక్షన్నర ఆదాయం పొందవచ్చు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట దగ్గరలోని చందర్లపాడులో ఉపేంద్ర అనే రైతు 20 ఎకరాలలో వెదురు సాగు చేస్తున్నారు. ఇప్పుడు ఆయనను 'బాంబూ ఉపేంద్ర' అంటున్నారు. వెదురుతో అనేక వస్తువులు తయారుచేస్తారు. ముఖ్యంగా పెళ్ళిళ్ళు మొదలైన వేడుకలలో వెదురుతో ఎన్నో రకాల ఆలంకరణలు చేస్తారు.



నవారా, మా పిళ్ళై సాంబ, కుళాకర్, గోదావరి యిసుకలు, రాజమూడి, ఇంద్రాణి, చింతలూరి సన్నాలు, రత్న చౌడి ఎన్నో వరి రకాలను విజయరాంగారు పరిచయంచేస్తున్నారు, వివిధ దేశవాళీ విత్తనాల సంరక్షణ, గానుగ నూనెల ప్రచారాన్ని కూడా ఆయన సాగిస్తున్నారు!

ఈ పద్ధతిలో పొలాన్ని మొదట్లో కొద్దిపాటిగా దున్ని సాగుకు అనుకూలంగా మార్చుకుంటే చాలు. దానిలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టవచ్చు. పొలం, ఆ పొలంలో చిన్న చెరువు, ఆవు వుంటే చాలు. ఇక బయటినుంచి ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణ మందులు, యిలాంటి అవసరమే వుండదు. పంట వ్యర్థాలు, గో మూత్రం, ఆవు పేడతో అన్నీ పొలంలోనే సమకూరుతాయి. ఒక్క ఉప్పు తప్ప మనిషికి నిత్య వినియోగానికి కావలసిన ఆహార పదార్థాలన్నీ ఆ పొలమే యిస్తుందనేది ప్రకృతి వ్యవసాయ నినాదం!

ఈ విధానంలో ఐదు దొంతర్ల పంటలసాగు ప్రధానాంశం. దీనిని యిప్పుడు 'సౌభాగ్యం' అని పిలుస్తున్నారు. తరకటూరులోని శ్రీ విజయరాం వ్యవసాయ క్షేత్రాన్ని కూడా 'సౌభాగ్య గో సదన్' అంటున్నారు. పొలంలో ముందుగా ఎత్తుమడులు చేసుకోవాలి. గట్లు వెడల్పుగా వుండాలి. పొడవు చెట్లు : (మామిడి, కొబ్బరి వంటివి), మధ్యరకం చెట్లు: (జామ, ఉసిరిక వంటివి), పొట్టి రకం: మునగ, బొప్పాయి వంటివి), తీగ, దుంప జాతి: పసుపు, చిలగడ దుంప, వేరుశనగ వంటివి). ఈ రకమైన ఐదు అంచెల వ్యవసాయంద్వారా పంటలకు సూర్యరశ్మి పుష్కలంగా అందుతుంది. నీటి అవసరం బాగా తగ్గుతుంది. విజయరాం గారి తరకటూరు వ్యవసాయ క్షేత్రంలో అరటి, బొప్పాయి, పసుపు, ఉసిరిక, జామ, సపోటా, మునగ, నేతిబీర, కరివేపాకు, అల్లం, వట్టివేరు,నేపాళం వంటి 30 రకాలకుపైగా పంటలను పండిస్తున్నారు.

**పంటలకు దన్నుగా పాడి : ఆవు, నంది**

ప్రకృతి వ్యవసాయంతో పాటు దేశవాళీ ఆవులతో పాడి పరిశ్రమను చేపట్టాలని రైతులకు శ్రీ విజయరాం సలహా యిచ్చారు. 12 నుంచి 15 ఆవులు, ఒక ఎద్దు కోసం ఒక ఎకరా సరిపోతుందని, మరో ఎకరా మెట్టచేసి, ఆవులు తిరగడానికి వదలాలని ఆయన సూచించారు. పాలుగా వ్యాపారం చేయడం కంటె, నెయ్యి వ్యాపారం మంచిదనేది ఆయన సలహా. గుజరాత్‌కు చెందిన రమేష్ అనే ఆతను కిలో నాలుగు వేల నుంచి, లక్ష రుపాయల వరకు విలువైన నెయ్యి రకాలు అమ్ముతాడని ఆయన చెప్పారు. దేశవాళీ ఆవుల మంచి నెయ్యి నెలకు 1–2 కిలోలు తింటే గర్భిణులు

*(మిగతా 27వ పేజీలో )*

# పి 4 ఫలాలు అందుకుంటున్న 'బంగారు కుటుంబాలు'

– చింతయ్య, రఘురామ్

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2029 నాటికి పేదరికరహిత రాష్ట్రంగా (సున్నా పేదరికం) తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన పి4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్) కార్యక్రమం వేగం పుంజుకుంటోంది. ఇది 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌కు అనుగుణంగా ఉంది. ఈ చొరవ ప్రభుత్వం, ప్రైవేట్ రంగం,సమాజం భాగస్వామ్యాన్ని ఒకే వేదిక మీదకు తెస్తుంది. 2029 సెప్టెంబర్ నాటికి జీవనోపాధి పెంపుదల, నైపుణ్యాభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా బంగారు కుటుంబాల సగటు ఆదాయాన్ని 20% వరకు పెంచడం, వారికి గౌరవప్రదమైన జీవనశైలి కల్పించడం పి4 ప్రాజెక్టు లక్ష్యం.



**యం ఇ ఐ ఎల్– ఏపిమాస్ భాగస్వామ్యం**

మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (యం ఇ ఐ ఎల్) మార్గదర్శిగా ఈ ప్రాజెక్ట్ కింద కృష్ణాజిల్లాలోని గుడ్లవల్లేరు, చిత్తూరు జిల్లాలోని రామకుప్పం మండలాలను దత్తత తీసుకుంది. ఈ రెండు మండలాల్లో అమలు బాధ్యతలను ఏపిమాస్ నిర్వహిస్తున్నది.

**నాలుగు రంగాలపై దృష్టి**

- జీవనోపాధి: ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఆకాంక్షలను పెంపొందించడం, జీవనోపాధి ప్రణాళికలు రూపొందించడం, వ్యాపార నైపుణ్యాలను, ఆర్థిక అక్షరాస్యత కల్పించడం.
- **సంక్షేమ హక్కులు:** ప్రభుత్వ పథకాలు, అవసరమైన మౌలిక పత్రాల (డాక్యుమెంట్స్) లభ్యతను సులభతరం చేయడం.
- **ఆరోగ్యం , విద్య:** ఆరోగ్య శిబిరాల నిర్వహణ, మందుల పంపిణీ , ఉన్నత విద్య కోసం విద్యార్థులకు స్కాలర్‌షిప్
- **గ్రామ మౌలిక సదుపాయాలు:** అంగన్‌వాడీ కేంద్రాల, పాఠశాలల పునరుద్ధరణ, వీధిదీపాలు, తాగునీరు డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల.

**బంగారు కుటుంబాలను గుర్తించడానికి ప్రాతిపదికలు**

- నెలకు రూ. 10,000 కంటే తక్కువ ఆదాయం ఉండటం.
- సొంతంగా భూమి, పశువులు లేదా ఉత్పాదక ఆస్తులు లేకపోవడం.
- కుటుంబంలో వ్యాధులు లేదా దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడే సభ్యులు ఉండటం.
- మహిళలు, వృద్ధులు లేదా అనాథల కుటుంబాలు.
- ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ , దివ్యాంగుల కుటుంబాలు.

**బంగారు మిత్రలు: పేదరికంపై పోరాడే సైనికులు**

ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన పాత్ర 'బంగారు మిత్ర'(కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్)లది. ఏపిమాస్ నిర్వహణలోని గుడ్లవల్లేరు, రామకుప్పం మండలాలలో మొత్తం 32 మంది బంగారు మిత్రలు ప్రాజెక్టులో చేరారు. వారికి శిక్షణ ఇవ్వబడింది. గుడ్లవల్లేరు మండలంలో 17 మంది బంగారు మిత్రలు 1,560 'బంగారు కుటుంబాల' అభివృద్ధికి బాధ్యత వహిస్తున్నారు.

**అమలులో ప్రస్తుత దశ**

- కుటుంబ అభివృద్ధి ప్రణాళిక (ఎఫ్ డి పి): 'కోబో టూల్‌బాక్స్' యాప్ ద్వారా ఇప్పటివరకు 1218 కుటుంబ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమైనాయి.



- దోకిపర్రులో నైపుణ్యాభి వృద్ధి కేంద్రం (ఎస్ డి సి) 2025 నవంబర్ 3న ప్రారంభమైంది. శిక్షణ కేంద్రంలో ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేసిన 24 మంది యువకులు ఇప్పటికే విజయవాడ, మచిలీపట్నంలో ఉద్యోగాలు సాధించారు.
- సుమారు 68 మంది దీర్ఘకాలిక వ్యాధులతో చికిత్స పొందుతున్నవారిని గుర్తించారు.
- గుడ్లవల్లేరు నుండి 42, రామకుప్పం నుండి 30 కుటుంబాల జీవనోపాధి అవసరాల జాబితాను సిద్ధం చేశారు. గుడ్లవల్లేరు మండలానికి 26 జీవనొపాధుల యూనిట్లు మమజూరు కాగా, డిసెంబర్ మూడవ వారంలో సుమారు రూ.13,18,992 నిధులతో 21 యూనిట్లను (గొర్రెలు, కుట్టు మిషన్లు, కిరాణా షాపులు, ఐరన్ బండ్లుమొదలైనవి) ప్రారంభించారు.
- 61 బంగారు కుటుంబాలలబ్ధిదారులకు ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్ల వంటి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను (పి ఎం ఏ వై) చేరవేయడంలో బంగారు మిత్రలు పూర్తి సహకారం అందించారు.

ఇటీవల ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్. రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ అరుణ గార్ల క్షేత్రస్థాయి పర్యటన ఈ ప్రాజెక్టుకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది. వారు పెంజెంద్ర, అంగలూరు, కౌతవరం (చెంచు కమ్యూనిటీ), దోకిపర్రు గ్రామాల్లో పర్యటించి పేదల బతుకు చిత్రాన్ని స్వయంగాపరిశీలించారు.

డాక్టర్ అరుణ గారు నిరుపేద కుటుంబాలతో మాట్లాడి, వారి వద్ద ఉన్న వనరులను, నైపుణ్యాలను విశ్లేషించి, వారికి తగిన ఉపాధి మార్గాలను సూచించారు. ముఖ్యంగా గొర్రెల పెంపకం, ఐరన్ బండ్లు వంటి చిన్నతరహా యూనిట్లను లబ్ధిదారులు నేరుగా పొందేలా చూశారు.

**సి.ఎస్. రెడ్డి సలహాలు,సూచనలు**

- సానుభూతితో కూడిన సేవ: బంగారు కుటుంబాలతో బంగారు మిత్రలు కేవలం ఉద్యోగులుగా గిరి గీసుకున్నట్టు కాకుండా, వారిలో ఒకరిగా కలిసిపోయి ఆత్మీయ బంధాన్ని పెంపొందించుకోవాలి.
- కుటుంబ ప్రణాళిక (ఎఫ్‌డిపి): ప్రతి కుటుంబం అవసరాలను బట్టి వారి ఆదాయం ఎలా పెంచాలో స్పష్టమైన 'ఫ్యామిలీ డెవలప్‌మెంట్ ప్లాన్' సిద్ధం చేయాలి.
- డేటా పారదర్శకత: గ్రామ సచివాలయాల డేటాతో క్షేత్రస్థాయి వివరాలను సరిపోల్చి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పి 4 లబ్ధిదారులు అయ్యేలా చూడాలి.
- సంఘాల బలోపేతం: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీలు) ద్వారా పేద మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషిచేయాలి




**రేపటి ఆశ:**

"నిరంతర పర్యవేక్షణ (మెంటారింగ్), సమర్థవంతమైన మార్గదర్శకత్వం ఉంటే ఏ ఒక్క కుటుంబం కూడా పేదరికంలో ఉండదు" అనే స్ఫూర్తితోనే పి4 ప్రాజెక్టు ముందడుగు వేస్తున్నది. ■

**తోటివారిని పైకి తేవాలంటే ముందుగా నీవు వారికంటె పై మెట్టుపై వుండాలి**

# పండ్ల ఉత్పత్తిలో అగ్రపీఠాన ఆంధ్రప్రదేశ్ !

**పం**డ్ల ఉత్పత్తిలో రాష్ట్రం దూసుకెళ్తోంది. 2024–25లో 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తితో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 71.70 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు పండిస్తుండగా, 11.87 కోట్ల టన్నులు పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. 2024–25లో ఉద్యాన పంటల సాగు, ఉత్పత్తిపై ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. దేశంలో ఉద్యాన పంటల సాగులో రెండో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్.. పండ్ల ఉత్పత్తిలో మాత్రం మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.



రాష్ట్రంలో 8.07 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉండగా.. 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తితో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో 1.81 లక్షల హెక్టార్లలో సాగు, 21.05 లక్షల టన్నుల పండ్ల ఉత్పత్తితో తెలంగాణ 15వ స్థానంలో నిలిచింది. అయితే సాగులో 8.96 లక్షల హెక్టార్ల అగ్రస్థానంలో ఉన్న మహారాష్ట్ర ఉత్పత్తిలో మాత్రం 1.68 కోట్ల టన్నులతో రెండో స్థానం దక్కించుకుంది. 5.89 లక్షల హెక్టార్లలో సాగు, 1.47 కోట్ల టన్నుల ఉత్పత్తితో ఉత్తరప్రదేశ్ మూడో స్థానంలో నిలిచాయి.

పండ్ల ఉత్పత్తిలో మధ్యప్రదేశ్ (1.02 కోట్ల టన్నులు), గుజరాత్ (93.47 లక్షల టన్నులు), తమిళనాడు (78.32 లక్షల టన్నులు), కర్ణాటక (53.26 లక్షల టన్నులు), బిహార్ (46.56 లక్షల టన్నులు), పశ్చిమబెంగాల్ (42.89 లక్షల టన్నులు), కేరళ (41.17లక్షల టన్నులు), ఒడిశా (30.28 లక్షల టన్నులు), అసోం (27 లక్షల టన్నులు), జమ్ము కశ్మీర్ (26.92 లక్షల టన్నులు), పంజాబ్ (26.17 లక్షల టన్నులు), తెలంగాణ (21.05 లక్షల టన్నులు), ఛత్తీస్‌గఢ్ (20.60 లక్షల టన్నులు), జార్ఖండ్ (13.59 లక్షల టన్నులు), రాజస్థాన్ (12.68 లక్షల టన్నులు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మిగతా రాష్ట్రాల్లో వేల హెక్టార్లలో సాగు చేస్తుండగా, పండ్ల ఉత్పత్తి 10 లక్షల టన్నులలోపే ఉంది.

దేశంలోని 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉద్యానతోటలుండగా, 18 రాష్ట్రాల్లోనే లక్ష హెక్టార్లపైన సాగవుతున్నాయి. ఈ రాష్ట్రాలే 10 లక్షల టన్నులపైన దిగుబడి సాధించాయి.

కాగా 2024–25లో ఏపీలో అరటి 1.11 లక్షల హెక్టార్లలో 67.34 లక్షల టన్నులు, మామిడి 3.99 లక్షల హెక్టార్లలో 49.86 లక్షల టన్నులు, బత్తాయి 1.13 లక్షల హెక్టార్లలో 23.73 లక్షల టన్నులు, బొప్పాయి 15 వేల హెక్టార్లలో 12.62 లక్షల టన్నులు, నిమ్మ 45 వేల హెక్టార్లలో 9.08 లక్షల టన్నులు, పుచ్చకాయలు 18 వేల హెక్టార్లలో 8.77 లక్షల టన్నులు, జామ 31 వేల హెక్టార్లలో 5.01 లక్షల టన్నులు, దానిమ్మ 15 వేల హెక్టార్లలో 3.86 లక్షల టన్నులు, సపోట 14 వేల హెక్టార్లలో 2.80 లక్షల టన్నుల ఉత్పత్తి వచ్చింది.

రాష్ట్రంలో ఉద్యాన పంటలకు సూక్ష్మసేద్యం అత్యధిక శాతం విస్తరించడంతో పండ్ల ఉత్పత్తి గతం కంటే పెరిగిందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే ఉద్యాన రైతులకు కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా రాయితీలు ఇస్తుండటంతో రాయలసీమలో పండ్ల తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని చెప్పారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ■

నిన్ను గురించి నీ మెదడుతో ఆలోచించు, ఇతరుల గురించి నీ మనసుతో ఆలోచించు

# సేంద్రియ ఆహారం అందించే 'భూమి ఓల్డ్ స్కూల్ ఫుడ్స్' !

డా॥ బి. నీహారిక, కృషి విజ్ఞాన కేంద్రం, కందుకూరు

**స**మాజం ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు మూలకారణం మన ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులే. రసాయనాలు, అధిక ప్రాసెసింగ్‌తో కూడిన ఆహారం ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్న ఈ రోజుల్లో, సాంప్రదాయ పోషకాహారాన్ని తిరిగి ప్రజలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న మహిళలలో ఒంగోలు పట్టణానికి చెందిన శ్రీమతి ఈ.అనిత ఒకరు. ఆమె స్థాపించిన 'భూమి ఓల్డ్ స్కూల్ ఫుడ్స్' సంస్థ, సాంప్రదాయం-సాంకేతికతల సమ్మేళనానికి ఒక ఉత్తమ ఉదాహరణ.

ఈ అనుభవమే ఆమెను రసాయనాలు లేని, సహజమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ముందుకు నడిపించింది.




చిన్నప్పట్లో మన ఇంట్లో అమ్మమ్మలు, తల్లులు తయారు చేసే ఆహారం ఆరోగ్యానికి ఎంత మేలు చేసేదో గుర్తు చేసుకుంటూ, ఆ పాత పద్ధతులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునరుజ్జీవింప చేయాలని ఆమె నిర్ణయించుకున్నారు.

**వ్యక్తిగత విషాదం నుంచి సామాజిక బాధ్యతకు**

శ్రీమతి అనిత జీవితంలో తల్లి మరణం (కోలన్ క్యాన్సర్ కారణంగా) ఒక మర్చిపోలేని సంఘటన. ఆ బాధ ఆమెను మానసికంగా కుంగదీసినా, అదే సమయంలో ఒక గొప్ప ఆలోచనకు దారి తీసింది. "నా తల్లి అనుభవించిన బాధను దగ్గరగా చూసిన తర్వాత, మనం రోజూ తీసుకునే ఆహారం ఆరోగ్యంపై ఎంత ప్రభావం చూపుతుందో నాకు బాగా అర్థమైంది" అని అంటారు శ్రీమతి అనిత.



**భూమి ఓల్డ్ స్కూల్ ఫుడ్స్**

పాత పద్ధతులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునరుజ్జీవింప చేయాలన్న సంకల్పం నుంచే 'భూమి ఓల్డ్ స్కూల్ ఫుడ్స్' అనే సేంద్రియ ఆహార కేంద్రం ఆవిర్భవించింది. ఇది కేవలం వ్యాపార సంస్థ మాత్రమే కాదు; ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించే ఒక ఉద్యమంలా ఎదిగింది.

సాంప్రదాయ గృహ పద్ధతుల్లో ధాన్యాలను దంచడం, రాయి గ్రైండర్లలో పిండి పట్టించడం వంటి ప్రక్రియలను ఆధునిక విద్యుత్ యంత్రాలతో మిళితం చేయడం ద్వారా, రుచిని, పోషక విలువలను సురక్షితం చేసుకుంటూ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచగలిగారు.

**కృషి విజ్ఞాన కేంద్రం కీలక పాత్ర**

ఈ ప్రయాణంలో కందుకూరు 'కృషి విజ్ఞాన కేంద్రం' (కె వి కె) అందించిన మార్గదర్శనం అనితకు బలమైన ఆధారం అయింది. కెవికె ద్వారా ఆమెకు సాంకేతిక శిక్షణ, ఆధునిక యంత్రాల వినియోగంపై అవగాహన, ఉత్పత్తి నాణ్యత పెంపుదలపై సూచనలు, ప్యాకేజింగ్, నిల్వ విధానాలపై మార్గదర్శనం లభించాయి.

సాంప్రదాయ పద్ధతులను పూర్తిగా వదిలిపెట్టకుండా, వాటిని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయడం ఆమె వ్యాపారానికి ప్రత్యేకతను తీసుకువచ్చింది.

**వైవిధ్యమైన, నాణ్యమైన ఉత్పత్తులు**

'భూమి ఓల్డ్ స్కూల్ ఫుడ్స్' ద్వారా శ్రీమతి అనిత

తయారుచేస్తున్న ఉత్పత్తులు వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించాయి. ముఖ్యంగా దంచిన దేశవాళి బియ్యం, పప్పులు, చిరుధాన్యాలు, గోధుమ పిండి, సేంద్రియ సుజీ, మాల్ట్ మిశ్రమాలు, పసుపు, కారం పొడులు, చెక్క గానుగ నూనెలు, సహజ షాంపూలు మొదలైన అన్ని ఉత్పత్తులు రసాయన పరిరక్షకాలు లేకుండా, సహజ పద్ధతుల్లో తయారవుతాయి.

**నాణ్యతకు ప్రథమ ప్రాధాన్యత**

ఉత్పత్తుల నాణ్యత విషయంలో అనిత ఎక్కడా రాజీ పడరు. ముడి సరుకులను నేరుగా సేంద్రియ సర్టిఫికేషన్ పొందిన రైతుల నుంచే సేకరిస్తారు. కెవికె సూచనలతో పర్యావరణ హితమైన ప్యాకేజింగ్, వాక్యూమ్ ప్యాకింగ్, క్యూఆర్ కోడ్ల వినియోగం ద్వారా ఉత్పత్తుల తాజాదనాన్ని కాపాడుతూ, నిల్వ కాలాన్ని పెంచుతున్నారు.

**ఆర్థిక సహకారం – వ్యాపారానికి బలం**

ఆహార ప్రాసెసింగ్ సూక్ష్మ పరిశ్రమల పథకం ద్వారా లభించిన 35% సబ్సిడీ, అలాగే ఎస్‌బిఐ బ్యాంకు రుణం అనిత వ్యాపారానికి కీలక మలుపు. ఈ సహకారంతో ఒంగోలులో తొలి ఔట్‌లెట్‌ను విజయవంతంగా ప్రారంభించారు. నేడు ఈ సంస్థ ప్రత్యక్ష వినియోగదారులకు సేవలు అందించడమే కాక ఇతర రిటైల్ ఔట్‌లెట్లకు కూడా ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. దీని ద్వారా ఆమెకు ఏటా సుమారు రూ. 7–8 లక్షల నికర ఆదాయంలభిస్తోంది.

“ఈ వ్యాపారం ప్రారంభించడం సులభం కాదు. కానీ సరైన మార్గదర్శనం, పట్టుదల ఉంటే మహిళలు ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించగలరు. మన చిన్నప్పటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని నేటి తరానికి అందించడమే నా లక్ష్యం,” అని అనిత గర్వంగా చెబుతారు.

**భవిష్యత్ దృష్టి – మహిళలకు స్ఫూర్తి**

భవిష్యత్తులో ‘భూమి ఓల్డ్ స్కూల్ ఫుడ్స్’ను మరింత విస్తరించి, కనీస ప్రాసెసింగ్ ద్వారా పోషక విలువలు పెంచే ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో అనిత గారు ముందుకు సాగుతున్నారు. ఆమె ప్రయాణం అనేక గ్రామీణ, పట్టణ మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తూ, మహిళా సాధికారతకు ఒక చక్కని మార్గదర్శకంగా నిలుస్తోంది. వ్యక్తిగత విషాదాన్ని సామాజిక ప్రయోజనంగా మలచిన శ్రీమతి అనిత కథ సాంప్రదాయం–నూతనత్వాల సమ్మేళనంతో మహిళలు సాధించగల విజయానికి నిదర్శనం.

■

## విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువమంది ఆంధ్రప్రదేశ్‌వారే !

విదేశాల్లో చదివే భారతీయ విద్యార్థుల్లో ఆంధ్రప్రదేశ్ వాసులు అత్యధికంగా ఉన్నట్లు నీతి ఆయోగ్ విడుదల చేసిన ‘ఇంటర్నేషలైజేషన్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా’ నివేదిక వెల్లడించింది. 2016లో 46,818 మేర ఉన్న ఈ సంఖ్య 2018 నాటికి 62,771కి పెరిగినట్లు వెల్లడించింది. అయితే కొవిడ్ కారణంగా 2020లో ఈ సంఖ్య 35,614కి తగ్గినట్లు తెలిపింది. సంఖ్య తగ్గినప్పటికీ ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులే తొలిస్థానంలో ఉన్నట్లు పేర్కొంది. తర్వాతి స్థానాల్లో పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, యూపీలున్నట్లు తెలిపింది.

2024 లెక్కల ప్రకారం మొత్తంగా 13.35 లక్షల మంది విదేశాల్లో చదువుతున్నట్లు వెల్లడించింది. ఇందులో 8.5 లక్షలమంది యూఎస్ఏ, యూకే, కెనడా, ఆస్ట్రేలియాల్లోనే ఉన్నారు. 2016–24 మధ్య ఇందులో 8.84% మేర వృద్ధిరేటు నమోదైనట్లు తెలిపింది. ఈ చదువులకోసం భారతీయ విద్యార్థులు 6.2 లక్షలకోట్లు ఖర్చుచేస్తున్నారని, ఇది భారతీయ జీడీపీలో 2%కి సమానమని నీతిఆయోగ్ తెలిపింది. భారత్ ట్రేడ్ డెఫిసిట్‌లో 75% భారతీయ విద్యార్థులు విదేశీ చదువుల కోసం చేస్తున్న ఖర్చుల ఫలితమేనని వెల్లడించింది. ఒక విదేశీ విద్యార్థి భారత్‌లో చదువు కోసం వస్తుంటే 28 మంది భారతీయ విద్యార్థులు విదేశాలకు పోతున్నట్లు తెలిపింది.

(ఈనాడు సౌజన్యంతో)

■

# ముగ్గురు తెలుగు తేజాలకు రాష్ట్రీయ బాల పురస్కార్!

దేశ రాజధాని ఢిల్లీలో వీర్‌బల్ దివస్ ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన పిల్లలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా ఏపీకి చెందిన పారా అథ్లెట్ శివాని, పర్వతారోహణలో తెలంగాణాకు చెందిన విశ్వనాథ్ కార్తికేయ, ఆంధ్రప్రదేశ్ లోని ఒంగోలుకు చెంది, ప్రస్తుతం గుజరాత్‌లో వుంటూ, చెస్ క్రీడలో అసమాన ప్రతిభ కనబరచిన ఏడేళ్ళ వాకా లక్ష్మీ ప్రాజ్ఞికలను రాష్ట్రీయ బాల పురస్కార్ వరించింది.

## పారా అథ్లెటిక్స్‌లో శివానికి పురస్కారం

శివాని స్వస్థలం ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా మద్దికెర గ్రామం. గత నాలుగేళ్లగా జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ్మ ప్రతిభ కనబరుస్తున్నందుకు శివానిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.



కర్నూలు జిల్లా మద్దికెర గ్రామంలోని ఉప్పర వీరప్ప, లలిత కూతురు శివాని. పుట్టుకతోనే ఆమె కుడిచేయి మోచేతి వరకే ఉంటుంది. అయినప్పటికీ ఆమె తల్లిదండ్రులు ఆమెకు భవిష్యత్ కోసం ఎంతో కష్టపడ్డారు. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో కూడా ఎంతో ఉత్సాహం కనబరిచేది. అనారోగ్యంతో తల్లి దూరమైనా పట్టు వదలకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తూ ఢిల్లీ వరకు ఎదిగింది. నవోదయా స్కూల్ ప్రిన్సిపాల్ ప్రోత్సాహంతో హైదరాబాద్‌లోని ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శివాని పారా అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటోంది. 2023లో విశాఖలో జరిగిన దివ్యాంగుల పోటీల్లో జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో శివాని బంగారు పతకాలు సాధించింది. ఆపై జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికై అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ శివాని పతకాలను సాధించింది. దుబాయిలో జరిగిన పారా యూత్ ఏసియన్ గేమ్స్, ఢిల్లీలో జరిగిన గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో కూడా పాల్గొని తన సత్తా చాటింది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

## పర్వతారోహణలో కార్తికేయకు ....

హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల విశ్వనాథ్ కార్తికేయ్ పడకంటి, ఏడు ఖండాల్లోని అత్యున్నత శిఖరాలను అధిరోహించే కఠినమైన 7 పర్వత శిఖరాల అధిరోహణ సవాలును పూర్తిచేసినందుకు బాల పురస్కార్ అవార్డును అందుకున్నారు. ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయసు భారతీయుడిగా, ప్రపంచంలో రెండో అత్యంత పిన్న వయస్కునిగా కార్తికేయ గుర్తింపు పొందారు.

2025 మే 26న విశ్వనాథ్ 8,848 మీటర్ల ఎత్తున్న మౌంట్ ఎవరెస్ట్‌ను విజయవంతంగా అధిరోహించడం ఈ సప్త శిఖరారోహణ సవాలులో చివరి అంకం. శారీరక శిక్షణ, మానసిక ధైర్యం, అచంచలమైన సంకల్పంతో సంవత్సరాల పాటు సాగిన ప్రయాణానికి ఇది ముగింపు ఘట్టంగా నిలిచింది.

ఈ విజయంపై గర్వం వ్యక్తం చేస్తూ విశ్వనాథ్ తల్లి లక్ష్మి “తనకు ఎంతో ఇష్టమైన రంగంలో మా బిడ్డ ప్రతిభ చూపడం చూసి మేము ఎంతో గర్వంగా ఉన్నాం. శారీరకంగా, మానసికంగా ఎదురైన అన్ని సవాళ్లను అధిగమించి ఇప్పుడు ప్రపంచం అతన్ని గుర్తించడం ఎంతో ఆనందంగా ఉంది. మొదట కార్తికేయ్ కొంచెం అలసత్వంగా ఉండేవాడు. ఇలాంటి గొప్ప సాధనకు ఎదిగిన తీరు మాకు అపారమైన గర్వాన్ని కలిగిస్తోంది” అని అన్నారు.

విశ్వనాథ్‌కు పర్వతారోహణలో మార్గదర్శకత్వం

**కదలని వారు, కదలగలిగిన వారు, కదిలి ముందుకు సాగుతున్న వారు అని మనుషులు మూడు రకాలు**



వహించినవారు భారతీయ సైన్యంలో పని చేసిన అనుభవజ్ఞుడు, ప్రముఖ పర్వతారోహకుడు లెఫ్టినెంట్ రొమిల్ భర్త్వాల్ , భరత్‌లుఈ

తన శిష్యుడిని ప్రశంసిస్తూ భర్త్వాల్ మాట్లాడుతూ, "విశ్వనాథ్ సాధించిన విజయం కేవలం పర్వతారోహణ మైలు రాయి మాత్రమే కాదు. అది అతని వినయం, బలం, అచంచలమైన సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. అతనికి మార్గనిర్దేశనం చేయడం నాకు గౌరవంగా భావిస్తున్నాను. క్రమశిక్షణ, లక్ష్యం, సరైన దృక్పథంతో యువత ఏమి సాధించగలరో అతను చూపిస్తున్నాడు" అని అన్నారు.

గత ఐదేళ్లుగా విశ్వనాథ్‌కు శిక్షణ అందిస్తున్న భరత్ మాట్లాడుతూ, "మేము కార్తికేయకు ఐదేళ్లుగా శిక్షణ ఇస్తున్నాం. భారతదేశంలో అత్యంత పిన్న వయసులో ఏడు శిఖరాలను అధిరోహించిన వ్యక్తిగా ఎదిగి, ఇప్పుడు ఈ అవార్డును పొందడం మాకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతి. కాలక్రమేణా అతని ఏకాగ్రత, నిబద్ధత మరింత బలపడింది" అని చెప్పారు.

**విశ్వనాథ్ అధిరోహించిన శిఖరాలు**

ఆసియాలో మౌంట్ ఎవరెస్ట్ (8,848 మీ / 29,029 అడుగులు), దక్షిణ అమెరికాలో అకోన్కాగ్వా (6,961 మీ / 22,838 అడుగులు), ఉత్తర అమెరికాలో డెనాలి (6,190 మీ / 20,310 అడుగులు), ఆఫ్రికాలో కిలిమంజారో (5,895 మీ / 19,341 అడుగులు), యూరోప్‌లో మౌంట్ ఎల్బ్రస్ (5,642 మీ / 18,510 అడుగులు), అంటార్కిటికాలో మౌంట్ విన్సన్ (4,892 మీ / 16,050 అడుగులు) మరియు ఆస్ట్రేలియాలో మౌంట్ కోసియస్కో (2,228 మీ / 7,310 అడుగులు). (ది న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్ సౌజన్యంతో)

## చెస్‌లో లక్ష్మీప్రాజ్ఞికకు పురస్కారం

**గు**జరాత్‌లోని సూరత్‌కు చెందిన ఏడేళ్ల చెస్ ప్రతిభావంతురాలు వాకా లక్ష్మీ ప్రాజ్ఞికకు 2025 సంవత్సరానికి గాను ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌ను ప్రదానం చేశారు. డిసెంబర్ 26న న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. క్రీడల రంగంలో ఆమె సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది.



వాకా లక్ష్మీ ప్రాజ్ఞిక ఒంగోలుకు చెందిన రామనాథ్, ప్రవీణల ద్వితీయ పుత్రిక. రామనాథ్ కుటుంబ ఉద్యోగ పరంగా సూరత్లోని గుజరాత్‌లో స్థిరపడ్డారు. ప్రాజ్ఞిక తండ్రి రామనాథ్ ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాలలో, అలాగే ఏకేనీ జూనియర్ కాలేజి, సీఎస్ఆర్ శర్మా కాలేజిలో విద్యాభ్యాసం చేయగా, ఆయన సతీమణి ప్రవీణ ఒంగోలులోని ఆదిత్య పబ్లిక్ స్కూలు, నాగార్జున జూనియర్ కాలేజి, ఏకే వీకే కాలేజిలో విద్య పూర్తి చేశారు.

లక్ష్మీ ప్రాజ్ఞిక సెర్బియాలో నిర్వహించిన 2025 ఫిడే వరల్డ్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్–7 బాలికల విభాగంలో 9 పాయింట్లకు మొత్తం 9 పాయింట్లు సాధించి, తిరుగులేని విజేతగా నిలిచి, భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని తెచ్చిపెట్టింది. వరల్డ్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా పూర్తి స్కోర్ సాధించిన తొలి క్రీడాకారిణిగా లక్ష్మీ ప్రాజ్ఞిక ఘనత సాధించడం విశేషం.

ప్రపంచ టైటిల్‌తో పాటు, ప్రాజ్ఞిక అనేకసార్లు గుజరాత్ రాష్ట్ర చాంపియన్‌గా నిలిచింది, జాతీయ స్థాయిలో పతకాలు సాధించింది. ఆమె విజయాలలో గుజరాత్ అండర్–7 గోల్డ్ మెడల్, గుజరాత్ అండర్–9 చాంపియన్‌షిప్ విజయం, నేషనల్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్ కాంస్య పతకం ఉన్నాయి. ■

# ఉప్పొంగిన ఉపాధి అవకాశాల గ్లోబల్ సమ్మిట్!

తెలంగాణాను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' విజయవంతంగా ముగిసింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గం ఇందుకోసం సుమారు 25 రోజులపాటు సర్వశక్తులూ కేంద్రీకరించి శ్రమించింది. ఫ్యూచర్ సిటీలో జరిగిన ఈ సదస్సు తెలంగాణ సత్తాను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటేలా సాగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండురోజుల సదస్సులో రూ. లక్షల కోట్ల పెట్టుబడులు, ఒప్పందాలపై దిగ్గజ సంస్థలు ప్రకటనలు చేయడం గమనార్హం.




**సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో..**

ఫ్యూచర్ సిటీలో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో సదస్సు నిర్వహణ ఏర్పాట్లు చేశారు. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో స్టార్ హోటల్ వసతులను తలపించేలా రెండు ప్రధాన హాళ్లు, మరో ఆరు అనుబంధ సమావేశ మందిరాలు ఏర్పాటు చేశారు. అతిథులు, ప్రతినిధులకు ఆహ్వానం, వసతి, రవాణా, భోజనం సహా ఎక్కడా లోటు రాకుండా ఏర్పాట్లు జరిగాయి. ప్రముఖులను శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా సదస్సు ప్రాంగణానికి రప్పించేందుకు మూడు ప్రత్యేక హెలిపాడ్లు నిర్మించారు. ప్రాంగణంలో పచ్చిక బయళ్ళను, పూలతోటలను సృష్టించారు.

మొత్తం 45 స్టాళ్లు..: 14 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో సమావేశ ప్రాంగణం నిర్మాణం కాగా, ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు ఎగ్జిబిషన్లో 45 స్టాళ్లు ఏర్పాటు చేశాయి. డిజిటల్, ఏఐ, 3 డి సాంకేతికత మేళవింపుతో ఆహూతులను అబ్బురపరిచేలా ఏర్పాటు చేసిన స్టాళ్లు తెలంగాణ, హైదరాబాద్ భవిష్యత్ ప్రగతిని కళ్ల ముందు సాక్షాత్కరింప చేశాయి. నెట్‌జీరో సిటీ, రక్షణ శాఖ, మూసీ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డిజిటల్ తెరలతో కూడిన డిజిటల్ టన్నెల్, రోబో, మూసీ టన్నెల్, ఏరోస్పేస్ స్టాళ్ల వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫ్యూచర్ సిటీ, మూసీ, గ్రీన్ ఎనర్జీ, ఏవియేషన్, ఉద్యానవన, లైఫ్ సైన్సెస్, హ్యాండ్లూమ్స్, పర్యాటక సాంస్కృతిక, రక్షణ, భద్రత విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వీక్షకులతో నిండిపోయాయి.

**పారిశ్రామికవేత్తలు, సినీ తారలు, క్రీడాకారులు**

ప్రధాని నరేంద్రమోదీతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సుమారు 5 వేల మందికి ప్రభుత్వం ఆహ్వానాలు పంపింది. అయితే భారత్ సహా 40కి పైగా దేశాల నుంచి సుమారు 2 వేల మంది అతిథులు, ప్రతినిధులు రెండు రోజుల సదస్సుకు హాజరైనట్లు అంచనా. అలాగే పారిశ్రామికవేత్తలు బాలీవుడ్, టాలీవుడ్ తారలు పాల్గొన్నారు.

యువ పారిశ్రామికవేత్తలు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాంగణమంతా కలియ తిరిగారు. సినీ తారలు అర్జున్ కపూర్, చిరంజీవి, సినీ నిర్మాతలు అల్లు అరవింద్, దగ్గుబాటి సురేష్‌బాబు, శ్యాం ప్రసాద్ రెడ్డి, రాకేష్ ఓం ప్రకాష్, జోయ అక్తర్, జెనీలియా, రితేష్ దేశ్ ముఖ్, ప్రముఖ క్రీడాకారులు అనిల్‌కుంబ్లే, పీవీ

సింధూ, సైనా నెహ్వాల్, గుత్తా జ్వాల తదితరులు సమ్మిట్లో ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచారు. సందర్శకులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల సిబ్బంది వారితో ఫోటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

**క్విజ్ కాంటెస్ట్ లో డీజీపీ**

ఇంధన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నెట్ జీరో సిటీ క్విజ్' కాంటెస్ట్లో డిజీపీ శివధర్‌రెడ్డి పాల్గొన్నారు. సదస్సులో 27 అంశాలపై తెలంగాణ స్థితిగతులు, అభివృద్ధి, భవిష్యత్తు అవకాశాలు, పెట్టుబడులకు సంబంధించి చర్చా గోష్టులు జరిగాయి.

**తెలంగాణ రుచులు.. ప్రత్యేక కానుకలు**

సదస్సుకు హాజరైన అతిథులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు చాటి చెప్పేలా ఇక్కత్ శాలువాలు, హైదరాబాదుకు ప్రత్యేకమైన ముత్యాల అభరణాల గిఫ్ట్ బాక్స్, అత్తరు అందజేశారు. హైదరాబాద్ బిర్యానీ, ఇతర 50 రకాల వంటకాలను రుచి చూపించారు. రెండురోజుల పాటు సాయంత్రం వేళల్లో సంగీత దర్శకులు కీరవాణి సంగీత కచేరీ, సామల వేణు మేజిక్ ప్రదర్శన నిర్వహించారు. డ్రోన్ షో, బాణసంచా ప్రత్యేక ఆక ర్షణగా నిలిచాయి. రెండు రోజుల పాటు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి సభా ప్రాంగణంలోనే మకాం వేశారు. సుమారు 2,500 మంది పోలీసులు, వేయి సీసీ కెమెరాలతో నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో ఉపాధి అవకాశాలు**

ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సంబంధిత కోర్సుల అవసరం చాలా ఉంది. అందువల్ల ప్లస్ టు దశలోనే ఈ కోర్సులను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నాం. ప్రస్తుతం కొన్ని కోర్సులను మాత్రమే నిర్వహిస్తున్నాం. ఏప్రిల్ నాటికి స్కిల్స్ వర్సిటీ పూర్తవుతుంది. ఆ తర్వాత మరిన్ని కోర్సులను తీసుకొస్తాం.

– వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు, వీసీ, స్కిల్స్ వర్సిటీ

■

## వ్యవసాయం, ఆయిల్ పామ్‌లలో అవకాశాలు పుష్కలం

**తమ** సంస్థ తెలంగాణలో నిర్మాణ, వ్యవసాయం.. అనుబంధ రంగాల్లో రూ.450 కోట్ల పెట్టుబడులు పెడుతుందని గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్ స్వామి 'ఆంధ్రజ్యోతి'కిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

'వ్యవసాయం, ఆయిల్ పామ్ రంగాల అభివృద్ధి అవకాశాలు పుష్కలం. ఇప్పటికే కోకాపేట, రాజేంద్రనగర్ లలో భారీ ప్రాజెక్టులు చేపట్టాం. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్లతో వచ్చే ఏడాది మేం ఏర్పాటు చేసే సమీకృత ఆయిల్ పామ్ కాంపెక్స్‌తో ప్రత్యక్షంగా 200 మంది, పరోక్షంగా 300 మందికి ఉపాధి లభిస్తుంది. రూ.150 కోట్ల అంచనాతో 40 ఎకరాల్లో హైదరాబాద్ శివార్లలో డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. దీనివల్ల 300 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్ష ఉపాధి లభిస్తుంది.

పారిశ్రామిక పెట్టుబడులకు తెలంగాణ వ్యూహాత్మక ప్రాంతం. పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం అద్భుతం. అందుబాటులో ఉన్న సాంకేతిక నిపుణులు, పర్యావరణ అనుకూల పరిస్థితులు, పటిష్ఠమైన ఐటీ వ్యవస్థ వంటి సానుకూలతలు హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి దోహదపడతాయి. మేం చేపట్టే ప్రతి కార్యక్రమం పర్యావరణహితం. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై రైతులు, గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం.

గ్రామీణ మహిళల్లో చైతన్యం తేవడానికి వచ్చే ఏడాది వివిధ కార్యక్రమాలు అమలు చేయనున్నాం. పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు సర్కారుకు సహకరించ బోతున్నాం. విద్యారంగంలో నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి, మా ప్రాధాన్యాలు' అని రాకేశ్ స్వామి తెలిపారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

# మహిళా సాధికారతలో రోల్ మోడల్‌గా తెలంగాణా

మహిళా సాధికారతలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలు ఎదిగితేనే దేశం ఎదుగుతుందని, ఈ మార్పునకు తెలంగాణనే నాయకత్వం వహిస్తోందని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో సెర్ప్, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్‌ను సీతక్క ప్రారంభించారు. అనంతరం ప్యానల్ చర్చలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థల అభివృద్ధిలో 65 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకంతో పేద మహిళలు, వికలాంగులు, అట్టడుగు వర్గాల వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

తెలంగాణలో ఒక్క మహిళ కూడా వెనుకంజలో ఉండకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. దేశం లోనే తొలిసారిగా 64 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్లు మహిళల నేతృత్వంలో ఏర్పాటు కాబోతున్నాయని, బస్సులు కొని ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా మహిళా సంఘాలకు ప్రతి నెలా ఆదాయం సమకూరుతోందని తెలిపారు. మరెక్కడా లేని విధంగా మహిళలే పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతో మహిళల ఆర్థిక స్వరూపం మారిపోయిందని పేర్కొన్నారు.

మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ. 7,600 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని గుర్తు చేశారు. 'రూ. 500కే గ్యాస్ సిలిండర్'తో 45లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. ప్రస్తుతం 52శాతంగా ఉన్న మహిళా శ్రామిక భాగస్వామ్యాన్ని 2047 నాటికి 90 శాతానికి పెంచాలని సంకల్పించామన్నారు. మహిళా పారి శ్రామిక క్లస్టర్లతో ఉపాధి అవకాశాలు సృష్టించే స్థాయికి మహిళలు ఎదిగారని చెప్పారు. ■


# సర్పంచ్‌ల భర్తల పాలనపై హక్కుల కమిషన్ సీరియస్!

దేశవ్యాప్తంగా పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికైన మహిళల స్థానంలో వారి భర్తలు పరోక్ష పాలన సాగించడాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. రాజ్యాంగ రక్షణలు, కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ ఎన్నికైన మహిళా ప్రతినిధులు నామమాత్రంగా మారుతున్నారని... అధికారాలన్నీ వారి భర్తలు అనుభవిస్తున్నారని ఆక్షేపించింది. హరియాణా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యుడు సుశీల్ వర్మ చేసిన ఫిర్యాదుపై కమిషన్ సభ్యుడు ప్రియాంక్ కానుంగో నేతృత్వంలో సమావేశమైన ధర్మాసనం విస్తృతంగా చర్చించింది. మహిళల పేరిట భర్తల పరోక్ష ప్రాతినిధ్యం 73, 74 రాజ్యాంగ సవరణల స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేసింది. ఎన్నికైన మహిళా ప్రతినిధులను డమ్మీలుగా మార్చడంపై కానుంగో గతంలోనే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలలిత ప్రాంతాల (యూటీలు) అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చర్యల నివేదిక (ఏటీఆర్)లను 2025 సెప్టెంబరు 9లోగా సమర్పించాలని నిర్దేశించారు. అయితే ఆంధ్రప్రదేశ్, బీహార్, ఒడిశా, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, యూపీలోని కొన్ని నగరాలు మాత్రమే నివేదికలు సమర్పించాయి. ఇప్పుడు సుశీల్ వర్మ ఫిర్యాదుతో కమిషన్ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. అన్ని రాష్ట్రాలు, యూటీల పంచాయతీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు 2025 డిసెంబర్ 22లోగా చర్యల నివేదికలను పంపాలని సమన్లను జారీ చేసింది. లేదంటే వారు డిసెంబర్ 30న సంబంధిత ఏటీఆర్‌లతో తమ ముందు హాజరవ్వాల్సి ఉంటుందని హెచ్చరించింది. ■

సత్యం చాలా భారమైనది , అందుకే చాలా కొద్దిమంది మాత్రమే దానిని భరిస్తారు

# తప్పిపోతున్న బాలికల సంఖ్య పెరుగుతోంది !

వివిధ కారణాలతో కనిపించకుండా పోతున్న వారి సంఖ్య ఆంరధప్రదేశ్‌లో పెరుగుతోంది. ఇందులోనూ ఆచూకీ తెలియనివారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. పోలీసులు సాంకేతిక పద్ధతులను ఉపయోగించి తక్కువ సమయంలోనే మిస్సింగ్ కేసులను చేధిస్తున్నారు. కనిపించ కుండా పోయినవారిలో మహిళలతోపాటు పురుషులూ ఉండడం గమనార్హం. విజయవాడ నగర కమిషనరేట్‌లో ఈ కేసులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికి 861 కేసులు నమోదవగా వీరిలో 55 మంది మహిళల వివరాలు తెలియలేదు. గత ఏడాదితో పోలిస్తే ఇది తగ్గింది.




సింగ్‌నగర్ యువతి (20) తన ప్రియుడితో కలసి ఇంటి నుంచి వెళ్లి పోయింది. పెళ్లి చేసుకునేందుకు ఇద్దరూ తిరుపతి వెళ్లారు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. యువకుడి సెల్ టవర్ లొకేషన్ తిరుపతి రావడంతో పోలీసులు వెళ్లి ఇద్దరినీ తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. జగ్గయ్యపేట మండల యువతి (22) కనిపించడం లేదని తల్లిదండ్రులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. అదే గ్రామ యువకుడితో కలసి వెళ్లిపోయిందని తేలగా వారి సీడీఆర్ ఆధారంగా ఆచూకీ తెలుసుకుని తీసుకొచ్చారు.

**మహిళలు, బాలికలే అధికం :** తప్పిపోతున్న వారిలో ఎక్కువ మంది మహిళలు, బాలికలే. 2025లో ఇంటి నుంచి వెళ్లిన వారిలో 162 మంది ఆచూకీ దొరకలేదు. వీరిలో 55 మంది మహిళలు, 11 మంది బాలికలు. అయితే, గతంతో పోలిస్తే మెరుగుదల కనిపిస్తోంది. 2024లో 1,214 మంది తప్పిపోగా 1,116 మంది ఆచూకీ లభించింది. చాలాప్రాంతాల్లో 10 వేల సీసీ కెమెరాలు పెట్టారు. వీటిలో నమోదైన దృశ్యాలు, కాల్ డేటా ఆధారంగా పోలీసులు కేసులు చేధిస్తున్నారు.

**కుటుంబ కలహాలే కారణం :** తప్పిపోతున్న కేసుల్లో ప్రధానంగా కుటుంబ కలహాలే కారణం. తల్లిదండ్రుల మధ్య సఖ్యత లేమి, పిల్లల ఆలన కొరవడటం, దురలవాట్లకు గురై ఇంటి నుంచి పారిపోతున్నారు. ఇది యుక్త వయస్కుల్లో ఎక్కువగా ఉంది. ప్రేమ వ్యవహారమూ కారణమే. ఇది యువతుల్లో ఎక్కువగా ఉంది. ఇంట్లో వారు ప్రేమను తిరస్కరించడంతో బయటకెళ్లి పెళ్లి చేసుకుంటున్నారు. వివాహేతర సంబంధాలూ గణనీయంగా ఉంటున్నాయి. పలువురు మోసగాళ్ల బారిన పడి గృహిణులు వెళ్లిపోతున్నారు. ఇలాంటి వారి జాబితాలో పురుషులూ ఉన్నారు.

మరోవైపు సామాజిక మాధ్యమాల్లో పరిచయాలు, తెలియని వ్యక్తులను కలవడం, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఛాటింగ్‌లు, ఫోన్ కాల్స్‌తో సాన్నిహిత్యం చివరకు మోసపోవడం. ఇటీవల ఇటువంటి ఘటనలే ఎక్కువగా జరుగుతున్నాయి. కాకినాడకు చెందిన 17 ఏళ్ల బాలిక ఇన్‌స్టాగ్రామ్‌లో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన యువకుడితో పరిచయం పెంచుకుంది. అతని మాటలు నమ్మి సుమారు 20 తులాల బంగారంతో హైదరాబాద్‌లో ఉన్న అతని వద్దకు వెళ్లింది. పోలీసులు వారిని తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పదో తరగతి చదువుతున్న ఓ బాలికను ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ యువకుడు మాటలతో మాయ చేశాడు. అతడిని కలవడానికి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. పోలీసులు సాంకేతికత ఆధారంగా ఆమె ఆచూకీ గుర్తించి, కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు ■

ఆలోచించకుండా మాట్లాడడం గురి చూడకుండా బాణం వేయడం ఒక్కటే

# మేలుజాతి వరి రకాలు: తెల్ల సన్నాలు, కుంకుమశాలి, టెటెన్!

**తూ**ర్పు కనుముల్లో పూర్వం ఆదివాసీలు సాగు చేసిన సంప్రదాయ(దేశవాళీ) వరి రకాలను అభివృద్ధి చేసి మేలి రకం వంగడాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చేపట్టిన పరిశోధనలు విజయవంతమయ్యాయి. మూడేళ్లపాటు ఆదివాసీ రైతుల నుంచి సేకరించిన 21 రకాల వంగడాలపై అధ్యయనం చేశారు. దిగుబడి, నాణ్యత ఆధారంగా మూడు రకాలు మేలి రకం వంగడాలుగా శాస్త్రవేత్తలు గుర్తించారు.

తూర్పుకనుముల్లో పూర్వం ఆదివాసీలు పలు రకాల సంప్రదాయ వరి విత్తనాలను సాగు చేసేవారు. దేశవాళీ వరి రకాలకు ఒక్కొక్క ప్రాంతంలో ఒక రకం పేరుతో ఆదివాసీలు పిలిచేవారు. కొన్నిరకాల వరి విత్తనాలు బాస్మతిని తలపించే సువాసనలు వెదజల్లుతుంటాయి. మరికొన్ని రకాలు మధుమేహం బాధితులు ఆహారంగా తీసుకున్నా చక్కెర స్థాయిని స్థిరంగా ఉంచుతాయి. ఈ రకాలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో లేవు. అతి కొద్ది మంది ఆదివాసీ రైతులు ఆహారం కోసం ఈ సంప్రదాయ విత్తనాలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకుంటున్నారు.

ప్రస్తుత రోజుల్లో మధుమేహం, రక్తపోటు బాధితులు ఆహారం కోసం సూపర్‌మార్కెట్లలో లభించే రెడ్, బ్రౌన్, బ్లాక్ రైస్‌ను అధిక ధర చెల్లించి కొనుగోలు చేసుకుని ఆహారంగా తీసుకుంటున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న వివిధ రకాల బియ్యం కంటే ఆదివాసీలు పూర్వం సాగుచేసే వరి వంగడాల్లో మానవుల ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు ప్రాథమికంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో అంతరించి పోతున్న ఆదివాసీల సంప్రదాయ వరి విత్తనాలకు పునరుజ్జీవం ఇచ్చేందుకు శాస్త్రవేత్తలు 2023లో పరిశోధనలు ప్రారంభించారు. మూడేళ్లపాటు వివిధ దశల్లో అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు మూడు మేలి రకాలను ఎంపిక చేశారు.

**గిరిజన రైతుల నుంచి సేకరణ**

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లా గిరిజన ప్రాంతాల రైతుల నుంచి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు సంప్రదాయ వరి వంగడాలను సేకరించారు. సుమారు 150 మంది రైతుల నుంచి 21 రకాల వంగడాలను సేకరించారు. ఈ వంగడాలను ఒక్కొక్క ప్రాంత ఆదివాసీలు ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. దీంతో శాస్త్రవేత్తలు వంగడాలకు నంబర్లు కేటాయించి పరిశోధనలు ప్రారంభించారు. ఈ దేశవాళీ రకాల్లో మంచి పోషక విలువలతో పాటు ఔషధ గుణాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**మూడేళ్లపాటు పరిశోధనలు**

సంప్రదాయ వరి రకాల విత్తనాలపై శాస్త్రవేత్తలు మూడేళ్లపాటు పరిశోధనలు నిర్వహించారు. ఖరీఫ్, రబీ మాసాల్లో ఏడాదికి రెండు పర్యాయాలు శాస్త్రవేత్తలు ప్రయోగాత్మక సాగు చేపట్టారు. ప్రధానంగా నాణ్యత, దిగుబడులు ఆధారంగా మూడు రకాలను ఎంపిక చేశారు. ఈ మూడు రకాల వంగడాలకు వచ్చే ఏడాది విత్తనోత్పత్తి చేపట్టనున్నారు. మరో రెండేళ్లలో దేశవాళీ వరి మేలి రకం వంగడాలు రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

**మూడు మేలి రకం వంగడాల ఎంపిక**

మూడేళ్ల ప్రయోగాత్మక సాగులో మూడు రకాల దేశవాళీ వంగడాలు ఆశాజనకంగా ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. తెల్ల సన్నాలు, కుంకుమశాలి, టెటెన్ ధాన్యం రకాల ఫలితాలు మెరుగ్గా ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తెల్ల సన్నాలు హెక్టారుకు 6.3 క్వింటాళ్లు, కుంకుమశాలి 6.1, టెటెన్ ధాన్యం ఏడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధాన్యం నాణ్యత, పరిమాణం, సువాసలను బాగున్నాయి. తెగుళ్లను తట్టుకునే శక్తి అధికంగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ■

చదువు విజ్ఞానాన్ని యిస్తుంది , సహృదయులతో సంభాషణం వివేకం కలిగిస్తుంది

# ఇంధన పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రథమ స్థానం

ఇంధన పరిరక్షణ (ఎనర్జీ ఎఫిషియన్సీ) రంగంలో ఏపీ మరోసారి సత్తా చాటింది. వరుసగా నాలుగో ఏడాది జాతీయ ఇంధన పరిరక్షణలో అవార్డును సాధించింది. ఈ అవార్డు ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్య రంగాల్లో స్థిరంగా ముందుకు సాగుతున్న ఏపీ పురోగతిని ప్రతిబింబిస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. 'అన్ని ప్రధాన రంగాల్లో ఇంధన సామర్థ్య కార్యకలాపాల్లో పురోగతి కనబరిచాం. జాతీయ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు –2025లో గ్రూప్ –11 విభాగంలో మొదటి స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకోగలిగాం. విద్యుత్తు రంగంలో సాధిస్తున్న పురోగతి, విద్యుత్తు ఆదాలో రాష్ట్రం సాధించిన విజయాల్లో సీఎం చంద్రబాబు దూరదృష్టి, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారం ఎంతో ముఖ్యమైనవి' అని అన్నారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ సీఈవో నాగలక్ష్మి, ఆమె బృందాన్ని విజయానంద్ అభినందించారు.

**ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరింత బాధ్యతగా పని చేస్తాం: నాగలక్ష్మి**

జాతీయ అవార్డుపై స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ సీఈవో నాగలక్ష్మి స్పందిస్తూ... ఇంధన సామర్థ్యాన్ని గరిష్ట స్థాయిలో పెంచేందుకు మరింత బాధ్యతగా పని చేస్తామన్నారు. ఏపీ 89.25 పాయింట్లతో గ్రూప్–2లో అగ్ర స్థానంలో ఉందని, గతేడాది కన్నా 2.3 శాతం ఎక్కువని ఆమె చెప్పారు.

**తెలంగాణకు రెండో స్థానం**

ఇంధన పరిరక్షణలో ఉత్తమ పనితీరుతో దేశవ్యాప్తంగా తెలంగాణ రెండో స్థానాన్ని సొంతం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీఆర్ఈడీసీఓ) ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం(హెచ్‌సీయూ)లో అమలు చేసిన కూల్ రూఫ్ ఆఫ్ డెమో ప్రాజెక్టుకు ఈ అవార్డు దక్కింది. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు–2025 ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ అవార్డునందుకున్నారు. ■

## జీవీఎంసీకి మూడు జాతీయ అవార్డులు

దేశంలోని పట్టణ స్థానిక సంస్థల పనితీరుపై 'పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా' నిర్వహించిన అధ్యయనంలో జీవీఎంసీకి జాతీయస్థాయిలో మూడు అవార్డులు లభించాయి. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ రీతూ ఖండూరీ భూషణ్ ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.

మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయంవృద్ధికి తోడ్పడేలా వివిధ పథకాల అమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను నగరంలోని మహిళలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడంతో పాటు యూసీడీ విభాగం ద్వారా సహకరిస్తుండడంతో 'ఉమెన్ ఎంపవర్‌మెంట్' కేటగిరీలో రెండో బహుమతి లభించింది.

నగరవాసులకు జీవీఎంసీ అందిస్తున్న సేవలు, సదుపాయా లతో పాటు చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టులపై సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తుండడంతో 'బెస్ట్ యూజ్ ఆఫ్ సోషల్‌మీడియా ఇన్ ఏ కార్పొరేట్ కాంపెయిన్' విభాగంలో జాతీయస్థాయి మొదటి బహుమతి లభించింది. బాల్యం కేంద్రాల ద్వారా నగరంలోని ఐదేళ్ల లోపు బాలల సంక్షేమం, ఆరోగ్యరక్షణ, విద్య, భద్రత, పోషణ, సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాల అమల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తుండడంతో బెస్ట్ సీఎస్ఆర్ ప్రాజెక్ట్ ఫర్ చైల్డ్‌కేర్ కేటగిరీలో జీవీఎంసీ మొదటిబహుమతి దక్కించుకుంది. ■

# ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా సంస్థగా 'శ్రీజ'!

**పం**ట సాగులో నష్టపోయిన మహిళలు... పాల ఉత్పత్తిలో చేతులు కలిపారు. లక్షల లీటర్లలో పాలసేకరణ చేస్తున్న మహిళా పాడి సహకార సంఘం నేడు దేశానికే స్ఫూర్తినిస్తోంది. 1.2 లక్షలమంది సభ్యులతో ప్రపంచంలోనే అతి పెద్ద మహిళా సంస్థగా గుర్తింపు పొందింది.

రాయలసీమలో అన్నీ వర్షాధార పంటలే. అక్కడి రైతులు సాగులో నష్టపోవడం మామూలైపోయింది. 'ఇలా కాదని, పశు పోషణతో నిలదొక్కుకోవచ్చు' అనుకున్నారు మహిళా రైతులు. అయితే అక్కడ కూడా సమస్యలు తప్పలేదు. ప్రైవేట్ డెయిరీలకి ఎంత నాణ్యంగా పాలు పోసినా, వాళ్లెంత ఇస్తే



అంతే తీసుకోవాల్సి వచ్చేది. అలాంటి పరిస్థితుల్లో 'శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' వారు అన్నమయ్యజిల్లాలోని రెడ్డికోటకు వచ్చారు. 'ఆడవాళ్లే ఉత్పత్తిదారులు... వారే యజమానులు' అంటూ పాల అమ్మకాలపై మహిళలకు అవగాహన కల్పించారు.

వారు సేకరించే పాలను వాళ్లే అమ్ముకుని డబ్బులు తీసుకునేలా ఏర్పాటు చేశారు. అలా 27 మందితో మొదలైన సంస్థ దినదినాభివృద్ధి చెంది పాలాభిషేకం చేసే స్థాయికి ఎదిగింది. ఉదాహరణకు శ్రీదేవి ఒక సామాన్య రైతు కూలీ. ఒకప్పుడు పిల్లలను చదివించే స్థోమత లేని ఆమె కూతురు... ఇప్పుడు విదేశాల్లో ఎంఎస్ చేస్తోంది.

శ్రీదేవి 'శ్రీజ'లో ఫౌండర్ మెంబర్‌గా చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ అదే సంస్థకు ఛైర్మన్ అయ్యారు. మేనేజ్‌మెంట్ బోర్డులోనూ అత్యధికంగా 11 మంది మహిళలే ఉన్నారు. వీరంతా రోజుకి 7.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తారు. "మహిళల్ని యజమానులను చేయాలని లీటర్‌కి రూపాయి చొప్పున పెట్టుబడి పెట్టించి మమ్మల్ని షేర్ హోల్డర్స్‌ని చేశారు. 15 రోజులకోసారి మా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. ఎక్కువ పాలు పోసినవారికి ఏటా బోనస్ ఉంటుంది" అన్నారు శ్రీదేవి.

తిరుపతి పరిసర గ్రామాల్లోని సామాన్య మహిళల కోసం మొదలైన చిన్న ప్రయత్నమే 'శ్రీజ మహిళా పాడి సహకార సంఘం'. కానీ నేడు అదే సంఘం స్వయం ఉపాధి, సుస్థిర ఆదాయం, మహిళా సాధికారతకు దిక్సూచి అయింది. అధిక వడ్డీరుణాలు, పాల ధర తక్కువ, మధ్యవర్తుల ఆధిపత్యం, పశుపోషణకు సరైన పరిజ్ఞానం లేకపోవడం వంటి ఎన్నో సమస్యలు చుట్టిముట్టిన సమయంలో... ఒక చిన్న గ్రూపు మహిళలతో 2014లో తిరుపతిలో ఏర్పాటయిన 'శ్రీజ మహిళా పాడి సహకార సంఘం' నేడు దేశానికే స్ఫూర్తినిస్తోంది.

**రైతు, డెయిరీ మధ్య అనుసంధానం**

ఈ మహిళలు పశువైద్య శాఖ, రైతు సంఘాలు, స్థానిక ఎన్జీఓల సలహాలతో పాడి సహకార సంఘం మొదలు పెట్టారు. సభ్యులందరికీ పశుపోషణలో శిక్షణ... క్రమబద్ధమైన పాలసేకరణ...బ్యాంకు రుణాలు, సబ్సిడీలలో సహాయం... రైతుకు డెయిరీకి మధ్య నేరుగా కనెక్షన్...ఈ నాలుగు స్తంభాలపై సంఘం తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ సంఘంలో చేరిన ప్రతి మహిళదీ ఒక పోరాట గాథే. అయితే సంఘం ఇచ్చిన బలం వారి జీవిత మార్గాన్ని పూర్తిగా మార్చి వేసింది.

"కొవిడ్ మహమ్మారి సమయంలో బెంగళూరులో ఉద్యోగం కోల్పోయాను. తరువాత మా సొంత ప్రాంతం

**అభివృద్ధిపట్ల అసంతృప్తి మరింత అభివృద్ధి మంత్రం, తప్పో ఒప్పో తెలియకపోవడం గుణపాఠాలకు మూలం**



తిరుపతికి వచ్చి 2 ఆవులతో పాడిలోకి అడుగుపెట్టాను. మొదట్లో చాలా సమస్యలు ఎదురైనా...ధైర్యంగా ముందుకు సాగాను. ఇప్పుడు 20 ఆవులను పోషిస్తున్నాను. సంఘానికి అత్యధికంగా పాలు సరఫరా చేసే వారిలో ఒకరిగా, అత్యధికంగా 874 షేర్లు కలిగి ఉన్నాను" అంటున్నారు నాగజ్యోతి.

**మార్పు మొదలైందిలా...**

గతంలో రోజూ 2 నుంచి 5 లీటర్ల పాలు తీసే సభ్యులు నేడు 10 నుంచి 15 లీటర్లకు ఎదిగారు. ఆదాయం నెలకు రూ. 3 వేల నుంచి 15 వేల వరకు పెరిగింది. కొందరు చిన్న డెయిరీలను ప్రారంభించారు. ఉన్నత చదువులున్నా ఉద్యోగం రాని అమ్మాయిలు పాలసేకరణ, టెస్టింగ్, అకౌంటింగ్ వంటి పనుల్లో నైపుణ్యం సంపాదించారు. స్త్రీల ఆర్థిక స్వతంత్రం కుటుంబ గౌరవాన్ని పెంచింది. "నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్డీడీబీ) సహకారంతో 'శ్రీజ' ఏర్పాటైంది. ఏడాదికి లక్ష రూపాయలు తీసుకుంటున్న మహిళలు 29 వేల మంది ఉన్నారు.

ఈ జర్నీ ఇక్కడితో ఆపకుండా దక్షిణ భారతదేశమంతా విస్తరించి 2 లక్షల సభ్యులను చేరుకొని... రోజుకి 15 లక్షల లీటర్ల పాలు సేకరించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాం. త్వరలో రోజుకి పది లక్షల లీటర్ల పాలు సేకరించాలన్నది మా ఆశయం" అంటున్నారు సంస్థ సిఈఓ తిమ్మప్ప సూర. ప్రస్తుతం సంస్థలో 1.2 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. వ్యాపార టర్నోవర్ రూ.1200 కోట్లు. ఈ మహిళా పాడిసంఘం ఒక రోల్ మోడల్‌గా మారి, ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా సంస్థగా గుర్తింపు పొందింది. అతి సామాన్య మహిళలు... నేడు పాల ఉత్పత్తిలో ఒకరికొకరు అండగా నిలబడి, ఆత్మగౌరవంతో విజయ విహారం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

## 'విజయ' పథంలో ప్రకృతి వ్యవసాయం !

*(12వ పేజీ తరువాయి)*

సుఖంగా ప్రసవిస్తారని చెప్పారు.

**తిరుమల వెంకన్నకు నివేదన**

2010 ప్రాంతంలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి జెర్సీ ఆవుల పాలతో అభిషేకం జరిగేదని, అది తెలిసి బాధపడి, తాను, మరికొందరం కలసి, 108 దేశవాళీ ఆవులను తిరుమల-తిరుపతి దేవస్థానానికి సమర్పించామని, తరువాత ఒకసారి తాను తిరుమల వెళ్ళినప్పుడు కనుక్కుంటే అవి 140 ఆవులకు పెరిగాయని, స్వామికి చేసే అభిషేకంలో 40 శాతం వాటి పాలనే వినియోగిస్తారని తెలిసి తాను చాలా సంతోషించానని ఆయన చెప్పారు. ఆనాడు తనకు ఏమీ లేదని, స్వామికి రెండు ఆవులిస్తే, ఈనాడు తనకు దాదాపు 200 ఆవులను, 56 ఎకరాల పొలాన్ని స్వామి యిచ్చారని శ్రీ విజయరామ్ భక్తితో చెప్పారు.

### ప్రకృతి వ్యవసాయ ప్రచారానికి చిన జియ్యర్ స్వామి పాదయాత్ర

**ఈ** శిక్షణ శిబిరం తొలిరోజున శ్రీ త్రిదండి రామానుజ చిన జియ్యర్ స్వామి వచ్చారని, ఈ వ్యవసాయ క్షేత్రం అంతటా తిరిగి ప్రకృతి వ్యవసాయ సౌందర్యాన్ని ఆస్వాదించారని శ్రీ విజయరామ్ తెలియజేశారు. రసాయనిక వ్యవసాయంతో భూమి పాడవుతున్నదని, ఆ పంటలు తిన్న మనుషులు శక్తిహీనులుగా మారుతున్నారని, దీనిని నివారించడానికి ప్రకృతి వ్యవసాయ ప్రచారానికి శ్రీ జియ్యర్ స్వామి స్వయంగా సంసిద్ధత వ్యక్తం చేసినట్టు ఆయన పేర్కొన్నారు. కనీసం 5 వేల మందితో త్వరలో పాదయాత్ర నిర్వహిద్దామని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని తమను శ్రీ చిన జియ్యర్ స్వామి ఆదేశించారని, తాను ఆ ప్రయత్నంలో వున్నానని శ్రీ విజయరామ్ తెలిపారు.

■

# టమాటాలో బొడ్డు , పూత కుళ్ళు నివారణకు సూచనలు

**ట**మాటా అభివృద్ధి చెందే దశలో నీటి ఎద్దడి, మొక్కల్లో కాల్షియం లోపం వల్ల బొడ్డు కుళ్లు కనిపిస్తుంది. నత్రజని, నేలలో కరిగే పొటాషియం, మెగ్నీషియం ఎక్కువగా వాడటం వల్ల ఈ సమస్య వస్తుంది. దీని నివారణకు నేలలో తేమ హెచ్చుతగ్గులు కాకుండా చూసుకోవాలి. భూమిలో తగినంత కాల్షియం ఉండేట్లు చూసుకోవాలి. పైరు కోత దశలో కాల్షియం నైట్రేట్ 7.5–10 గ్రాములు లేదా కాల్షియం క్లోరైడ్ 4 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**వంగలో కొమ్మ, కాయకుళ్లు తెగుళ్ల నివారణ ఎలా?**

శీతాకాలంలో వంగ పంటను కొమ్మ, కాయకుళ్లు తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. మొక్క నుంచి కాయ కోత వరకు దీని ప్రభావం ఉంటుంది.







ఈ తెగులు సోకిన ఆకులపై గుండ్రని బూడిద, గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. దీని వల్ల కాండం, కాయలు కుళ్లి రాలిపోతాయి. దీని నివారణకు ఆరోగ్యవంతమైన మొక్క నుంచే విత్తనం సేకరించాలి. కాస్త వేడిగా ఉన్న నీటిలో విత్తనం నానబెట్టి విత్తుకోవాలి. తొలిదశలో లీటరు నీటికి మాంకోజెబ్ 2 గ్రా. కలిపి పిచికారీ చేయాలి.

**పసుపులో ఆకుమచ్చ తెగులు – నివారణ**

ఆకుమచ్చ తెగులు సోకిన పసుపు ఆకులపై చిన్నచిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి అవి గోధుమ మచ్చలుగా మారతాయి. తెగులు తీవ్రమైతే ఆకు మాడిపోతుంది. దుంపలు, కొమ్ములు, మొక్కల ఎదుగుదల లోపించి దిగుబడి, నాణ్యత తగ్గుతుంది.

ఈ తెగులు కట్టడికి లీటరు నీటికి మాంకోజెట్ 2.5 గ్రాములు లేదా కార్బండిజమ్ 1 గ్రాము లేదా ప్రోపికోనజోల్ 1ఎం.ఎల్ ను 0.5 ఎం.ఎల్ జిగురుతో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

**బత్తాయిలో ఆకుముడత, మంగునల్లి కట్టడికి జాగ్రత్తలు**

బత్తాయిలో ఆకుముడత పురుగు రాకుండా ముందు జాగ్రత్తగా లీటరు నీటికి వేపనూనె 5 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. ఒకవేళ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బత్తాయిలో మంగునల్లి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా డైకోఫాల్ 3 ఎం.ఎల్ లేదా ప్రాపర్ జైట్ 1 ఎం.ఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

**పెరిగిన చలి.. వరి నారుమడి రక్షణకు చర్యలు**

చలి తీవ్రత పెరిగి రాత్రివేళ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ తరుణంలో వరి నారుమడుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

దీనిలో భాగంగా రాత్రివేళల్లో నారుమడిపై టార్పాలిన్, పాలిథిన్ షీట్ లేదా సంచులతో కుట్టిన పట్టాలను కప్పి మరుసటి రోజు ఉదయం తీసివేయాలి. దీంతో చలి ప్రభావం తక్కువగా ఉండి నారు త్వరగా పెరుగుతుంది. నారు దెబ్బ తినకుండా రోజూ ఉదయాన్నే మడిలో చల్లటి నీటిని తీసేసి మళ్ళీ కొత్త నీరు పెట్టాలి. ■

# ' అనంత 'లో యాపిల్ సాగు ప్రయోగం సఫలం!



**రా**యలసీమలోని అనంతపురం అంటే మనకు ఠక్కున గుర్తొచ్చేసి కరువు.. ఎండలు... ఎడారీకరణ జరుగుతున్న పల్లెలు. అక్కడక్కడా కని పించే గుళ్ళు గోపురాలు.. కొండల మాటున అక్కడక్కడా సాగయ్యే వేరు శెనగ.. బెంగళూరుకు వలసవెళ్లే కూలీలు.. చలికాలంలో కూడా భగ్గున మండే ఎండలు.. ఇదంతా అనంతపురం సొంతం.. దాని బ్రాండ్.. కానీ ఇప్పుడు అనంతపురం తన రూటును మార్చుకుంటున్నది. ఎక్కడో శీతలప్రాంతాల్లో పండే యాపిల్స్ ఇప్పుడు అనంతపురం జిల్లాలో కూడా పండుతున్నాయి. మంచు కురిసే ప్రాంతాల్లో పండాల్సిన యాపిల్స్ నిప్పులు కురిసే అనంతపురంలో పండుతున్నాయి...కాలం మారింది!

అనంతపురం వాతావరణం అంటే దక్షిణ భారతదేశం లోనే ఒక ప్రత్యేకమైనది. ఇది భారతదేశంలోనే అత్యల్ప వర్షపాతం గల ప్రాంతం. దారుణమైన నీటి కొరతను ఎదుర్కొనే వ్యవసాయ ప్రాంతాల్లో ఒకటి. ఈ జిల్లాలో 90% కంటే ఎక్కువ భూముల రైతులు వాననీటిపై ఆధారపడి సేద్యం చేస్తున్నారు. ఇక్కడ వర్షం తక్కువ.. బావులు.. బోర్లు.. కాలువలు కూడా మృగ్యమే. దీంతో ఇక్కడ అంతటి వర్షాభావ పరిస్థితుల్లో మనగలిగే పత్తి, మామిడి, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేస్తారు. కానీ ఇప్పుడు ఇక్కడ పరిస్థితులు మారాయి. హార్టికల్చర్ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ద్రాక్ష, యాపిల్ వంటి పళ్ళను సైతం పండేలా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా రైతులు, పరిశోధకులు ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్నా మనగలిగే యాపిల్ రకాలను అన్వేషిస్తున్నారు. ఇవి వేడి వాతావరణంలో కూడా పెరగ గలవు. అయితే వీటికి సాగునీరు అందించాల్సి ఉంటుంది. దీంతోబాటు డ్రిప్ ద్వారా నీరు అందిస్తే యాపిల్ మరింత ఆరోగ్యకరంగా పెరుగుతుంది. ప్రయోగాత్మకంగా ఇక్కడ యాపిల్ సాగు సఫలం కావడంతో మున్ముందు మరింతగా ఈ సాగు పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఒక మొక్క అద్భుతంగా కాపునివ్వడంతో శాస్త్రవేత్తలు, రైతుల్లో సంతోషం మిన్నంటింది. మున్ముందు ఇక్కడ కూడా యాపిల్ సాగు సాధ్యమే అనే విశ్వాసం పెంపొందింది. దీంతో ఈ యాపిల్ సాగుపై అధికారులు, రైతుల్లో అసలు పెరిగి.. ఈ దిశగా కృషి మొదలైంది.

**విశాఖ మన్యంలోనూ యాపిల్ సాగు..**

అనంతపురంలోనే కాకుండా అల్లూరి జిల్లా చింతపల్లి జీకే వీధి మండలాల్లో యాపిల్ సాగు మంచి ఫలితాలను ఇస్తోంది. సముద్ర మట్టానికి 1200 అడుగుల ఎత్తులో ఉండే చింతపల్లి జీకేవీధి, పాడేరు, అరకులోయల్లోని ఏజెన్సీ ప్రాంతాలు యాపిల్ సాగుకు అనువైన ప్రాంతంగా నిలుస్తు న్నాయి. దీంతోబాటు 'ఆంధ్రా కాశ్మీర్'గా పిలిచే లంబసింగి యాపిల్ సాగుకు అనుకూలం అని తేలింది.

ఇక రెండు వెరైటీల యాపిల్ చెట్లు ఇక్కడ పెరిగాయని సాగు చేసిన రైతులు చెబుతున్నారు. ఇక్కడ పండుతున్న ఒక్కో యాపిల్ బరువు 300 – 400 గ్రాములు వుంటున్నది. విశాఖ ఏజెన్సీలోని దమనపల్లి పంచాయతీ కింద ఉన్న మడెం అనే గిరిజన గ్రామంలో యాపిల్ తోటను పెంచారు. ఒక్కో చెట్టుకు 30 నుంచి 34 యాపిల్ పండ్లు వచ్చాయి. కొన్నేళ్ల క్రితం పాడేరు ఐటీడీఏ అధికారులు యాపిల్ మొక్కలను కొంతమంది రైతులకు అందజేసి యాపిల్ పెంపకాన్ని ప్రోత్సహించారు. ప్రస్తుతం విశాఖ ఏజెన్సీలోని మండలాల్లో 60 నుంచి 70 ఎకరాల్లో యాపిల్ సాగులో ఉంది. దీన్ని కనీసం 200 ఎకరాలకు విస్తరించాలన్నది అధికారుల ప్లాన్. మొత్తానికి ఏపీ ఇక యాపిల్స్ అడ్డాగా మారనున్నది. ■

స్వప్నానికి సంకల్పానికి ఒకటే తేడా . . . నిదురపడితే వచ్చేది స్వప్నం, నిదురపట్టనివ్వనిది సంకల్పం

# గుండెపోటు ముప్పును పెంచే చలికాలం... బహుపరాక్!

**ఉ**ష్ణోగ్రతలు తగ్గినప్పుడు గుండెపోటు కేసులు పెరుగుతుంటాయి. శరీర అంతర్గత వ్యవస్థల్లో మార్పులు గుండెపై భారాన్ని పెంచుతాయి. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నవీన్ అగర్వాల్... చలికాలంలో గుండెపోటు ప్రమాదం పెరగడానికి గల ఆరు కారణాలను, గుండెను రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చలికాలం వచ్చిందంటే వాతావరణమే కాదు, మన శరీరం లోపల కూడా అనేక మార్పులు జరుగుతాయి. ఈ మార్పులు గుండెపై అదనపు ఒత్తిడిని పెంచుతాయి. రక్త ప్రవాహం మారడం నుండి జీవనశైలి మార్పుల వరకు... ఈ కారణాలన్నీ గుండె సంబంధిత ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతాయి. అందుకే ఈ సీజన్‌లో గుండె ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండటం, ఏమాత్రం తేడా అనిపించినా వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం.

ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, అడ్వాన్స్‌డ్ హార్ట్ ప్రొసీజర్లలో నిపుణులైన డాక్టర్ నవీన్ అగర్వాల్... చలికాలంలో గుండెపోటు ప్రమాదం పెరగడానికి గల ఆరు కీలక కారణాలను వివరించారు. డిసెంబర్ 8న ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఒక వీడియోలో, చలికి శరీరం సహజంగా స్పందించే విధానాలు, కాలానుగుణ జీవనశైలి మార్పులు గుండెపోటు ప్రమాదాన్ని ఎలా పెంచుతాయో ఆయన వివరించారు.

**6 ప్రధాన కారణాలు**

చలికాలంలో ఉష్ణోగ్రతలకు అనుగుణంగా మారడానికి శరీరంలోని కొన్ని యంత్రాంగాలు సహజంగానే మారుతాయి. రక్తపోటులో మార్పులు, రక్తం గడ్డకట్టే స్వభావం పెరగడం, రక్తనాళాల మందం పెరగడం వంటివి ఈ మార్పులలో ఉన్నాయి. ఇవన్నీ పరోక్షంగా గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయని డాక్టర్ అగర్వాల్ వివరించారు.

**1. రక్తనాళాలు సంకోచించడం**

"చలి వాతావరణం కారణంగా, మీ గుండెలోని రక్తనాళాలు సంకోచిస్తాయి. దీనివల్ల రక్తపోటు సహజంగా పెరుగుతుంది. అప్పుడు మీ గుండె అదనంగా రక్తాన్ని పంప్ చేయాల్సి వస్తుంది. అంటే అది మరింత కష్టపడాలి. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది" అని డాక్టర్ అగర్వాల్ పేర్కొన్నారు. చలికి అనుగుణంగా ఉండటానికి రక్తనాళాలు కుంచించుకుపోవడమే దీనికి ప్రధాన కారణం.

**2. రక్తం గడ్డకట్టే ధోరణి పెరుగుదల**

చలికాలంలో రక్తం గడ్డకట్టే సహజ స్వభావం పెరుగుతుందని కార్డియాలజిస్ట్ నొక్కి చెప్పారు. రక్తం చిక్కగా మారడం, గడ్డకట్టడానికి ఎక్కువ అవకాశం ఉండటం గుండెపోటు ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుంది.

"చలి కాలంలో, మీ రక్తం గడ్డకట్టే ధోరణి పెరుగుతుంది. రక్తం కొద్దిగా చిక్కగా లేదా జిగటగా మారుతుంది. ఇది సమస్యలకు దారితీయవచ్చు" అని ఆయన తెలిపారు.

**3. వైరల్ ఇన్‌ఫెక్షన్లు**

చలికాలం వైరల్ ఇన్‌ఫెక్షన్లు ఉధృతంగా ఉండే సీజన్ అని డాక్టర్ అగర్వాల్ గుర్తించారు. "ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్లు శరీరంలోని రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. అదే సమయంలో, శరీరంలో ఏదైనా ఇన్‌ఫెక్షన్ లేదా వాపు ఏర్పడినప్పుడు రక్తం గడ్డకట్టే ధోరణి పెరుగుతుంది. దీనివల్ల కూడా గుండెపోటు ప్రమాదం మరింత పెరుగుతుంది" అని ఆయన వివరించారు.

**4. నీరు తక్కువగా తీసుకోవడం**

చలికాలంలో చాలామంది నీరు తక్కువగా తాగుతుంటారు. దీనివల్ల డీహైడ్రేషన్ ఏర్పడుతుంది.

"శరీరంలో నీరు తగ్గడం వల్ల రక్తం చిక్కగా మారుతుంది. రక్తం చిక్కగా మారితే, దాన్ని సమర్థవంతంగా పంప్ చేయడానికి గుండెకు ఎక్కువ కష్టం అవుతుంది. ఈ ఒత్తిడి కారణంగా గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ వచ్చే అవకాశం పెరుగుతుంది" అని ఆయన సూచించారు.

**5. శారీరక శ్రమ తగ్గడం**

సాధారణంగా వ్యాయామం, శారీరక కదలికలు గుండె ఆరోగ్యానికి గొప్ప రక్షణగా పని చేస్తాయి. కానీ చలికాలంలో చాలామంది ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతారు, శారీరక శ్రమను తగ్గిస్తారు. "శారీరక శ్రమ తగ్గడం వల్ల రక్త ప్రసరణ తగ్గుతుంది. ఇది గుండెపోటు వచ్చే అవకాశాన్ని కూడా పెంచుతుంది" అని డాక్టర్ అగర్వాల్ చెప్పారు.

**6. అధిక కొవ్వు ఆహారపదార్థాలు**

చలిని తట్టుకోవడానికి, ప్రజలు సహజంగానే వెచ్చగా ఉండే, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాలు, పానీయాలను ఎక్కువగా తీసుకుంటారు. "చలికాలంలో ప్రజలు ఎక్కువ కొవ్వు పదార్థాలు, పానీయాలను తీసుకుంటారు. ఇది కూడా శరీరంలో రక్తం గడ్డకట్టే ధోరణిని పెంచుతుంది" అని డాక్టర్ అగర్వాల్ నొక్కి చెప్పారు.

**గుండె దడ తగ్గించుకోవడానికి 5 చిట్కాలు**

అకస్మాత్తుగా ఛాతీలో ఏదో దడదడలాడినట్లు, దేనినో కోల్పోయినట్లు అనిపిస్తే చాలా భయమేస్తుంది. ఆందోళనగా లేదా అధిక ఒత్తిడితో ఉన్నప్పుడు ఈ అనుభూతి మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే, చాలా సందర్భాలలో ఇది గుండె బలహీనతకు సంకేతం కాదు. గుండెదడ అనేది తరచుగా ఒత్తిడి, ఆందోళన లేదా అలసట సమయంలో అడ్రినలిన్ పెరగడం వల్ల కలుగుతుంది. కాబట్టి, ఇది గుండెకు సంబంధించిన ప్రమాదకర సంఘటన కాకుండా, శరీరం ఇచ్చే ఒక సహజ ప్రతిస్పందన మాత్రమే.

ముఖ్యంగా, ఆ సమయంలో ప్రశాంతంగా ఉండటం, మీ వ్యవస్థను శాంతపరచడం, ఆ అనుభూతిని ప్రేరేపిస్తున్న కారణాన్ని గుర్తించడం చాలా అవసరం. అడ్వాన్స్‌డ్ హార్ట్ ఫెయిల్యూర్, మెకానికల్ సర్క్యులేటరీ సపోర్ట్‌లో నిపుణుడైన కార్డియాలజిస్ట్, హార్ట్-ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ డిమిత్రి యారనోవ్, గుండెదడను తగ్గించుకోవడానికి మార్గాలను పంచుకున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో డాక్టర్ యారనోవ్ గుండెదడ సాధారణంగా హానికరమైనది కాదని, ఒత్తిడికి శరీరం ఇచ్చే ప్రతిస్పందన అని వివరించారు. అయినప్పటికీ, ఇతర ఆందోళన కలిగించే లక్షణాలు (ఉదా: ఛాతీ నొప్పి) ఉన్నట్లయితే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని ఆయన సూచించారు.

"గుండెదడ చాలా నాటకీయంగా అనిపిస్తుంది. మీ గుండె కొట్టుకోవడం ఆగిపోయినట్లు, రెపరెపలాడినట్లు లేదా ఎక్కడి నుంచో ఈల వేసినట్లు అనిపిస్తుంది. కానీ నేను నా రోగులకు చెప్పేది ఇదే: చాలావరకు గుండె దడ మీ గుండె ఫెయిల్ అయినప్పుడు కాదు, మీ శరీరం ప్రతిస్పందించినప్పుడు వస్తుంది" అని ఆయన వివరించారు.

**1. నెమ్మదిగా శ్వాస తీసుకోండి**

నెమ్మదిగా, లోతైన శ్వాస తీసుకోవడం వల్ల ఛాతీలో రెపరెపలాడటాన్ని నియంత్రించవచ్చు. "నియంత్రిత శ్వాసను నెమ్మదిగా బయటకు వదలడం వల్ల మీరు 'ఫైట్-ఆర్-ఫ్లైట్ మోడ్ నుండి బయటకు వచ్చి, వేగంగా మీ గుండె లయను స్థిరపరుచుకోవచ్చు" అని డాక్టర్ యారనోవ్ వివరించారు.

**2. వేగల్ ప్రేరణ**

క్రమరహిత గుండె లయను తగ్గించడానికి వేగస్ నరాన్ని ప్రేరేపించే చర్యలు చేయాలని డాక్టర్ యారనోవ్ సిఫార్సు చేస్తున్నారు. కొద్దిగా కిందకు వంగడం లేదా ముఖంపై చల్లటి నీటిని చల్లుకోవడం వంటివి - ఈ అనుభూతిని ప్రేరేపిస్తున్న అడ్రినలిన్ లూప్‌ను అడ్డుకోగలవు" అని ఆయన హైలైట్ చేశారు.

**3. ప్రేరేపణను కనుగొనండి**

గుండెదడ వివిధ కారణాల వల్ల సంభవించవచ్చు. దానికి దారి తీస్తున్న ప్రేరేపణను గుర్తించడం ద్వారా మూలకారణాన్ని తెలుసుకోవచ్చు. ఆ కారణాన్ని తొలగించినప్పుడు, గుండె దడ దానంతటదే తగ్గుతుంది. "కెఫిన్, ఆల్కహాల్, నికోటిన్, ఒత్తిడి, సరిగా నిద్ర లేకపోవడం, డీహైడ్రేషన్, మసాలా ఆహారాలు - మీ గుండె దడదడలాడటానికి దాదాపు ఎప్పుడూ ఒక కారణం ఉంటుంది. ఆ కారణాన్ని తొలగించండి, గుండె దడ మాయమవుతుంది"

# డ్వాక్రా బజార్‌లో రూ.19 కోట్లకు పైగా అమ్మకాలు

**ఆం**ధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన డ్వాక్రా బజార్‌లో రూ. 19.06 కోట్ల రికార్డుస్థాయి అమ్మకాలు జరిగాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025 డిసెంబర్ 15 నుంచి 26 వరకూ నిర్వహించిన డ్వాక్రా బజార్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏర్పాటుచేసిన స్టాళ్లలో రూ. 12.86 కోట్ల విలువైన ఉత్పత్తులు అమ్ముడయ్యాయి. తెలంగాణ రాష్ట్రం స్టాళ్ల నుంచి రూ. 1.62 కోట్లు, ఉత్తరప్రదేశ్ స్టాళ్ల నుంచి రూ. 1.26 కోట్ల వ్యాపారం జరిగింది.

స్వయం సహాయ సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖల సహాయంతో ప్రతి ఏటా ఈ ఎగ్జిబిషన్‌లు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది విజయనగరం, విశాఖపట్నం, గుంటూరులో డ్వాక్రా బజార్‌ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి యిచ్చింది.

విశాఖ జిల్లా నుంచి డీఆర్‌డీఏ, మెప్మా, నాబార్డు, ఇతర సంస్థల సహకారంతో 56 స్టాళ్లు ఏర్పాటు చేశారు. స్వయం సహాయ సంఘాల సభ్యుల ఉత్పత్తులను మాత్రమే బజార్‌లో అనుమతించారు. చేనేత చీరలు, పట్టుచీరలు, చుడీదార్, తదితర డ్రెస్‌లు, హస్తకళ ఉత్పత్తులు, ఇత్తడి/కంచు, రాగి వస్తువులు, టెర్రకోట్ పెయింటింగ్స్, ఖాదీ ఉత్పత్తులు, కలంకారీ ఉత్పత్తులు, తినుబండారాలు, పచ్చళ్ళు, ఇంటి అలంకరణ, మహిళల అలంకరణ వస్తువులు ఎక్కువగా అమ్ముడయ్యాయి.

రెండేళ్ల క్రితం విశాఖలో నిర్వహించిన బజార్‌లో రూ. 10 కోట్ల విలువైన వ్యాపారం జరగ్గా, ఈ ఏడాది దక్షిణ భారతదేశంలోనే అత్యధికంగా రూ. 19.02 కోట్ల వ్యాపారం జరిగిందని డీఆర్‌డీఏ పీడీ బెందాళం లక్ష్మీపతి తెలిపారు.

**విశాఖ జిల్లా టాప్**

విశాఖ జిల్లా నుంచి ఏర్పాటు చేసిన 56 స్టాళ్లలో రూ. 1.79 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయి. ఆ తరువాత గుంటూరు జిల్లా స్టాళ్ల ద్వారా రూ1.19 కోట్ల విలువైన ఉత్పత్తులు, అనకాపల్లి డ్వాక్రా మహిళలు రూ. 84 లక్షల విలువైన ఉత్పత్తులు, విజయనగరం జిల్లా మహిళలు రూ. 82 లక్షల విలువైన ఉత్పత్తులు విక్రయించారు. డ్వాక్రా బజార్ నిర్వహణకు సుమారు రూ.కోటి ఖర్చయింది.

■

---

అని డాక్టర్ వివరించారు.

**4. శరీరంలో నీటి స్థాయిని పెంచండి**

డీహైడ్రేషన్ (శరీరంలో ద్రవం, నీటి శాతం తగ్గడం), తక్కువ ఎలక్ట్రోలైట్ స్థాయిలు గుండెదడకు సాధారణ కారణాలుగా ఉంటాయి. అందుకే సకాలంలో శరీరంలో ద్రవ స్థాయిని పెంచడం వల్ల మీ గుండె లయను స్థిరంగా ఉంచవచ్చు.

"తక్కువ ద్రవాలు లేదా ఎలక్ట్రోలైట్స్ గుండెను చికాకు పెడతాయి. నేను చూసే 'రాండమ్' గుండె దడ కేసుల్లో సగం డీహైడ్రేషన్ వల్ల వచ్చినవే" అని డాక్టర్ యారనోవ్ ఎత్తి చూపారు.

**5. ప్రశాంతంగా ఉండండి**

మీరు ప్రశాంతంగా, సంయమనంతో ఉండటం వల్ల గుండె దడను తగ్గించుకోవచ్చు. ఎందుకంటే, ఇది అడ్రినలిన్ స్థాయిలను తగ్గిస్తుంది. తద్వారా ఒత్తిడి హార్మోన్ల పెరుగుదల గుండె కొట్టుకోవడాన్ని మరింత పెంచకుండా నిరోధిస్తుంది.

"అడ్రినలిన్ వల్ల వచ్చే గుండె దడ భయానకంగా అనిపించవచ్చు. కానీ అవి చాలా అరుదుగా ప్రమాదకరమైనవి. అయితే, ఛాతీ నొప్పి, మూర్ఛ, శ్వాస ఆడకపోవడం వంటివి ఉంటే లేదా దడ పదేపదే వస్తుంటే, వెంటనే వైద్య సహాయం పొందాలి" అని డాక్టర్ యారనోవ్ సూచించారు.

(హెచ్ టి తెలుగు వెబ్ సైట్ సౌజన్యంతో)

■

**వివేకం వంద ఏళ్ళుగా చేసిన కృషిని అవివేకం ఒక్క క్షణంలో భస్మం చేస్తుంది**

# స్వయం సహాయ మహిళలకు రూ. 15 వేల రివాల్వింగ్ ఫండ్

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త డ్వాక్రా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండు వేల కొత్త డ్వాక్రా గ్రూపులకు రూ 3 కోట్ల మేర రివాల్వింగ్ ఫండ్ ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని సంఘాల సభ్యులు తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. కొత్తగా ఏర్పాటైన డ్వాక్రా సంఘాలకు రూ 15 వేలు చొప్పున రివాల్వింగ్ ఫండ్ ఖరారు చేసింది. ఈ రివాల్వింగ్ ఫండ్ ద్వారా సంఘం నిధిని పెంచుకొనే అవకాశం కలుగుతుంది.

సంఘంలోని సభ్యుల అవసరాలకు అనుగుణంగా డ్వాక్రా సంఘం ఈ నిధుల వినియోగం పైన నిర్ణయం తీసుకుంటుంది. బ్యాంకుల ద్వారా పెద్ద మొత్తంలో రుణాలు పొందేందుకు వీలుగా ఈ రివాల్వింగ్ ఫండ్ ను డ్వాక్రా సంఘాల సభ్యులు వినియోగించుకోనున్నారు.

ఈ ఫండ్ ద్వారా సంఘాలు తమ ఉత్పత్తుల కోసం బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకునే వెసులు బాటు ఉంటుంది. ఈ నిధులను ప్రభుత్వం త్వరలోనే సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఈ మేరకు జిల్లాలకు సంఘాల జాబితాను పంపించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధుల ద్వారా కొత్త డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా తమ బలం పెంచుకునే అవకాశం కలుగుతుంది.

రుణాల తిరిగి చెల్లింపులో ఏపీ డ్వాక్రా సంఘాలు ముందంజలో ఉన్నాయి. రీ పేమెంట్ క్రమం తప్పకుండా ఉండటంతో బ్యాంకులు సైతం తిరిగి రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మందికి పైగా మహిళలు డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. దీంతో, ప్రభుత్వం త్వరలోనే మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

**ఎనిమిది లక్షల రూపాయల రుణం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల కోసం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వారికి ఆర్థిక భరోసా కల్పించడానికి, స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి తక్కువ వడ్డీకి రుణాలు, సబ్సిడీ కార్యక్రమాలను అందించనుంది. స్త్రీ నిధి పథకం కింద మరో రెండు నూతన పథకాలను ప్రవేశ పెట్టాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ పథకాల ద్వారా స్వయం సహాయక సంఘాలలోని ఒక్కో మహిళకు లక్ష రూపాయల నుంచి గరిష్టంగా 8లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది.

**48 గంటల్లోనే అకౌంట్‌లో డబ్బులు**

పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడానికి ప్రభుత్వం ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కళ్యాణ లక్ష్మీ అనే రెండు పథకాలను అందించడానికి సిద్ధమైంది. ఈ పథకాల ద్వారా డ్వాక్రా గ్రూపు సభ్యుల పిల్లల ఉన్నత విద్య, వారి వివాహాల కోసం ఆర్థికంగా చేయూత లభించనుంది. ఈ రుణాల పంపిణీ వేగంగా జరగనుంది.

స్త్రీనిధి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు జీవనోపాధి కోసం ఎనిమిది లక్షల రూపాయల వరకు, కుటుంబ ఖర్చుల కోసం ఒక లక్ష రూపాయల వరకు రుణాలను పొందవచ్చు. ఈ రుణాలు నేరుగా 48 గంటల్లోనే మహిళల బ్యాంకు ఖాతాలలో జమ అవుతాయి. అంతేకాకుండా రుణగ్రహీత మరణిస్తే, ఆ కుటుంబంపై భారం పడకుండా స్త్రీనిధి సురక్ష యోజన కింద రుణాన్ని రద్దు చేసే వెసులుబాటు కూడా ఉంది.


**పనితీరు ఆధారంగా గ్రేడ్ల వారీగా లోన్లు**

స్వయం సహాయక సంఘాల పనితీరు, ఆర్థిక బలోపేతమైన విధానాన్ని బట్టి వాటిని ఎ, బి, సి, డి గ్రేడ్లుగా వర్గీకరించి రుణాలను అందిస్తున్నారు. ఉదాహరణకు.. ఏ గ్రేడ్ సంఘానికి కోటి రూపాయల వరకు, బి గ్రేడ్ సంఘానికి 90 లక్షల రూపాయలు, సి గ్రేడ్ సంఘానికి 80 లక్షల రూపాయలు, డి గ్రేడ్ సంఘానికి 70 లక్షల రూపాయల వరకు రుణ సదుపాయం కల్పిస్తారు. ■

**మార్పును తిరస్కరించేవాడు వినాశనం కోరుకునేవాడే ; అభివృద్ధి కోరుకోనిది ఒక్క శ్మశానం మాత్రమే !**

# ప్రధాని మెప్పు పొందిన నరసాపురం లేసుల కళ!

నరసాపురం లేస్ క్రాఫ్ట్ మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ సంప్రదాయ కళ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోందని తెలిపారు. 'తరతరాలుగా మహిళల చేతుల్లో వికసించిన ఈ కళ.. నేడు ఆర్థిక ప్రగతికి కీలక సాధనంగా మారింది. అత్యంత ఓర్పు, నైపుణ్యం, నిబద్ధతతో తరతరాలుగా మహిళలే దీన్ని కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఈ సంప్రదాయానికి ఆధునికతను జోడిస్తూ, కొత్త డిజైన్లు, మెరుగైన శిక్షణతో ముందుకు తీసుకెళ్తున్నారు. ఏపీ ప్రభుత్వం, నాబార్డ్








సంయుక్తంగా కళాకారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తూ. కొత్త మార్కెట్లతో అనుసంధానం చేయడం ద్వారా ఈ కళకు ప్రోత్సాహం లభిస్తోంది. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ లభించడం మరింత గుర్తింపునిచ్చింది. ప్రస్తుతం లేస్‌తో 500కు పైగా ఉత్పత్తులు తయారవుతున్నాయి. 250కి పైగా గ్రామాల్లో సుమారు లక్షమంది మహిళలకు ఉపాధి లభిస్తోంది' అని ప్రధాని కొనియాడారు. నరసాపురం లేస్ కార్మికుల శ్రామిక సౌందర్యాన్ని గుర్తించిన ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు.

**లేస్ పరిశ్రమకు కేరాఫ్ నరసాపురం**

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్దనున్న సీతారాంపురం గ్రామం లేస్ పరిశ్రమకు చిరునామాగా నిలుస్తోంది. దాదాపు 160 ఏళ్ల క్రితం ఐర్లాండ్ దేశస్థులు వ్యాపార నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చారు. ఇక్కడి మహిళలకు అల్లికలపై శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించడంతో పాటు అల్లిన లేస్‌లను విదేశాలకు ఎగుమతి చేశారు. అలా మొదలైన లేస్ పరిశ్రమ 1970 నుంచి ఊపందుకుంది. నర్సాపూర్‌లోని లేస్ పరిశ్రమ చేతితో తయారు చేసిన దిండు కవర్లు, కుషన్ కవర్లు, బెడ్ స్ప్రెడ్‌లు, టేబుల్ రన్నర్లు, టేబుల్‌క్లాత్‌లు, అలంకార లేస్‌అల్లికలు, డోర్ - విండో కర్టెన్లు, బెడ్ లినెన్‌ల వంటి వివిధ రకాల ఉత్పత్తులను అందిస్తుంది. వేలాదిమందికి ఉపాధి కల్పించడమే కాకుండా ఏటా రూ.150 కోట్లకు పైగా ఎగుమతులు జరుగుతాయి.

2010 నుంచి ఈ పరిశ్రమకు మరో ముందడుగు పడింది. జిల్లాలోని పాలకొల్లు, ఆచంట,పోడూరు మండలాలతో పాటు కోనసీమ జిల్లాలోని మల్కిపురం ప్రాంతంలో మహిళలు అల్లికలు చేసేవారు. దీనికి ఒక బ్రాండ్ ఉండేది కాదు.

2010లో ప్రభుత్వం నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలో లేస్ పార్కును ఏర్పాటు చేసి మహిళలకు అల్లికల్లో ఆధునిక శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. ఫెడరేషన్‌గా ఏర్పాటు చేసి కుట్టుమిషన్లు, మార్కెటింగ్ సదుపాయాలను కల్పించి చేయూతనిచ్చింది.

తర్వాత కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలో రుస్తుంబాదలో ట్రేడింగ్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడా శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల ముంబై, మీరట్లకు కూడా ఈ కళ విస్తరించింది. పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల్లో లక్ష మంది మహిళలు అల్లికల్లో నైపుణ్యం పొందారు. దీన్ని గుర్తించిన కేంద్రం నరసాపురం లేసు పరిశ్రమకు భౌగోళిక గుర్తింపును (జియోగ్రాఫికల్ ఐడెంటిటీ) కూడా ఇచ్చింది. ■

గుండెల్లో రగిలే కోపం బుర్రను పొగచూరేలా చేస్తుంది

# జీవనోపాధుల బలోపేతం

ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు

డైరీఫాం, పౌల్ట్రీ




పందిళ్ళపై
కూరగాయల సాగు



బహుళ
పంటల సాగు







పెరట్లో కూరగాయల
పెంపకం



చిరు ధాన్యాల సాగు



చిరు ధాన్యాల ప్రాసెసింగ్

NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD-1064/2024-26
Publication Date:01-01-2026 Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 Posting Date: 05/06-01-2026



దివంగత శ్రీ రామారెడ్డికి ప్రముఖుల స్మృత్యంజలి!





లక్నోలోని బ్యాంకర్ల గ్రామీణాభివృద్ధి సంస్థ (బర్డ్) నిర్వహించిన 'ఎఫ్ పి ఓలు, ఎస్ హెచ్ జి ల మధ్య సమన్వయం' సదస్సులో శ్రీ సి ఎస్ రెడ్డి




ఏపిమాస్ రజితోత్సవ సంవత్సరం సందర్భంగా వీలేరులో కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం

To ADDRESS



తెలంగాణా గ్లోబల్ సమ్మిట్‌లో శ్రీ సి ఎస్ కు సన్మానం

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని,
తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089

MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 5 రంగారెడ్డి జనవరి 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-

## అభివృద్ధి పథంలో వడివడిగా తెలంగాణా ... శిఖరాగ్ర విశ్వ సమ్మేళనం!!




విశ్వ సమ్మేళనం ప్రారంభ సమావేశంలో తెలంగాణా గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి శ్రీ కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క ప్రభృతులు



శ్రీ మామిడి రామారెడ్డి సంస్మరణ

నూతన ఆంగ్ల సంవత్సర, 2026 సంక్రాంతి శుభాకాంక్షలు !

Silver Jubilee Year
apmas
Empowering Communities




తెలంగాణాలో సహకార రంగంపై మహాసభ



స్మరజిత్ రే స్మారక ప్రసంగం : శ్రీ త్రిలోచన్ శాస్త్రి

తిరిగి ప్రాణంపోసుకున్న ప్రకృతి వ్యవసాయం!



శ్రీ విజయరాం

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌లో తెలుగు తేజాలు !



శివాని కార్తికేయ ప్రాజ్ఞిక

నాబార్డ్ సౌజన్యంతో ....